RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

07 మార్చ్ 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:237



## అంబర్‌పేట్‌లోని డీసీపీ ఈస్ట్ జోన్ కొత్త కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన: మంత్రి పొన్నం ప్రభాకర్



**అంబర్‌పేట్‌ప్రజాబలం ప్రతినిధి** మార్చి 6హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లోని డీసీపీ ఈస్ట్ జోన్ కొత్త కార్యాలయ భవనాన్ని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి రవాణా, తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.మంత్రి కొత్త డీసీపీ ఈస్ట్ జోన్ భవనాన్ని పరిశీలించి, భవనం నిర్మాణంలో ప్రతి ఒక్కరి కృషినిఅభినందించారు.అగ్నిమాపక కేంద్రం, రిజిస్ట్రేషన్ కార్యాలయం మరియు తహసిల్దార్ కార్యాలయం నిర్మాణం కోసం మీరు ప్రభుత్వ భూమిని చూపిస్తే, దానిని కేటాయించడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.మా పోలీసులు శాంతిభద్రతలను కాపాడుతున్నారు మరియు ప్రజలతో మంచి సంబంధాలను కొనసాగిస్తున్నారు మరియు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచుతున్నారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని మరియు బాధితులకు న్యాయం అందించడానికి హైదరాబాద్ పోలీసులను కోరారు. హైదరాబాద్ విశ్వనగరం ??కాబట్టి, ఇక్కడ పర్యాటకం మరియు ఐటీ అన్నీ అభివృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు. సిసిటివి కెమెరాల సాంకేతికత నేరస్థులను పట్టుకోవడం మరియు వారిని ఉక్కు చేతితో ఎదుర్కోవడం సులభం చేస్తుంది. సహాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి వారు మద్దతుగా ఉండాలి. బాలస్వామి ఐపీఎస్ డీసీపీ ఈస్ట్ జోన్‌ను కూడా ఆయన అభినందించారు. లిడిసిపి ఈస్ట్ జోన్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ ఐపిఎస్ మాట్లాడుతూ, కొన్ని రోజులుగా ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నామని, ఈరోజు ప్రారంభోత్సవం జరిగినందుకు మాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. డిసిపి ఈస్ట్ జోన్ కార్యాలయానికి చాలా చరిత్ర ఉంది, ఈ జోన్ 1982లో స్థాపించబడింది. డిసిపి ఈస్ట్ జోన్ కార్యాలయం అంబర్‌పేటకు మార్చబడింది, అప్పటి నుండి ఈ జోన్‌కు ప్రత్యేక కార్యాలయం లేదు. ప్రభుత్వం కొత్త భవనం నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. శాంతిభద్రతలు అమలు చేయబడేలా మరియు నేరాలు నియంత్రణలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాంతిభద్రతలు, మహిళల భద్రత, ప్రజలకు మరియు వారి ఆస్తులకు రక్షణ కల్పిస్తే మన రాష్ట్రంలో పెట్టుబడులు వస్తాయనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది, ఇది ఆర్థిక వ్యవస్థకు సహాయపడుతుంది. ప్రభుత్వం ప్రతి పోలీస్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేయగలిగితే, అలాంటి వాతావరణాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వానికి మంచి గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్ నగర పోలీసులు కూడా అదే తరహాలో పనిచేస్తున్నారు, వారు హైదరాబాద్ నగర పరిధిలో రాత్రిపూట ముమ్మరంగా గస్తీ తిరుగుతున్నారు, దీని కారణంగా నేరాలు చాలా తగ్గాయి, మరియు మరో నాలుగు లేదా ఐదు పోలీస్ స్టేషన్లు ప్రారంభించబోతున్నారు, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తారు. ప్రజలకు మంచి రక్షణ కల్పించడానికి శాంతిభద్రతలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటారు. ట్రాఫిక్ విభాగంలో కొన్ని భవనాలు కూడా పూర్తయ్యాయి. ట్రాఫిక్ నిర్వహణ ద్వారా ప్రజలు సకాలంలో తమ గమ్యస్థానానికి చేరుకునేలా చర్యలు తీసుకుం టున్నాము. అందులో భాగంగా ఆపరేషన్ రోప్ అమలు చేయబడుతుంది మరియు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తారు. సిగ్నల్ టైమింగ్స్ నిర్వహణ ప్రజలకు మంచి సౌకర్యాన్ని అందిస్తుందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ అన్నారు."హైదరాబాద్ నగర పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల సేవలో ఉంటారు"అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యుడు వి. హనుమంత రావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ అదనపు సీపీ లా అండ్ ఆర్డర్, ఎం. రమేష్ ఐపీఎస్ ఐజీపీ డీజీపీ ఆఫీస్, జోయెల్ డేవిస్ ఐపీఎస్, జాయింట్ సీపీ ట్రాఫిక్, బాలస్వామి ఐపీఎస్ డీసీపీ ఈస్ట్ జోన్, . స్నేహ మెహ్రా ఐపీఎస్ డీసీపీ సౌత్ జోన్, చైతన్య కుమార్ డీసీపీ ఎస్బీ, వైపీఎస్ సుధీంద్ర డీసీపీ టాస్క్ ఫోర్స్, కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## త్వరలోనే బిజెపికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం : శ్రీధర్ బాబు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 6 :** కాంగ్రెస్ ను ఓడించేందుకు బిజెపి, బిఆర్‌ఎస్ కుట్ర చేస్తుందని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఎమ్మెల్సి ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ కుమ్మక్కయ్యాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై గాంధీభవన్ లోఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చాయా?నని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి పని చేశాయని బిఆర్‌ఎస్ బలం అంతా పెట్టి బిజెపికి సపోర్ట్ చేసిందని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఆ రెండు పార్టీలు కలిసి ఓడించాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్ట్ ఇచ్చామని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చానన్నారు. తాము బిజెపికి ఎన్నో గిఫ్టులు

## నూతన ఎమ్మెల్సీలకు మోడీ అభినందనలు



న్యూఢిల్లీ మార్చి 6 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. తెలంగాణకు చెందిన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని అభినందించారు. బిజెపికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పని చేస్తున్న ప్రతీ ఒక్క కార్యకర్తను చూసి గర్విస్తున్నానని మోడీ పేర్కొన్నారు. మరోవైపు ఎపిలో విజయం సాధించిన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలుపుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్‌ను మోడీ రీపోస్ట్ చేశారు. కేంద్రం, ఎపి ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తుందని.. రాష్ట్ర అభివృద్ధికి ప్రయాణాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని మోడీ పేర్కొన్నారు.

## ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

### ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా ప్రభుత్వం నిజాలను దాచి ఉంచింది

### ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపడ్డ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 6 :** ఎస్–ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలను దాచి ఉంచిందని ఆరోపించారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే రెండు నివేదికలు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి, నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం ముందుకు పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ గతంలో రెండు నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా, కేవలం కమీషన్ల కోసమే పనులను నిర్వహించిందని కేటీఆర్ అన్నారు. ఆ నివేదికలలో చెప్పిన విధంగానే రెడ్ జోన్ ప్రాంతంలోనే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎనిమిది కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మొత్తం కేబినెట్ ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ రెండు నివేదికల అంశంపై స్పష్టతను ఇవ్వాలని.. హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది కుటుంబాలతో పాటు రాష్ట్ర ప్రజల తరపున ఈ అంశంపై పూర్తి వివరాలు విడుదల చేయాలని కేటీఆర్ అడిగారు. ఈ ప్రమాదానికి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మైనింగ్ రంగంలో మహిళా శక్తికి అరుదైన గౌరవం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, మార్చి 6** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బొగ్గు గనుల్లో పనిచేస్తూ ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఉత్తమ మహిళా ఉద్యోగులు, అధికారులను హైదరాబాద్ లో గురువారం కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి .కిషన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే , తెలంగాణ రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క ), సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో సింగరేణి సంస్థలో మైనింగ్ అధికారులుగా భూ గర్భ గనుల్లో విధులు నిర్వర్తిస్తున్న మైనింగ్ అధికారులు అంబటి మౌనిక (పీవీకే 5 ఇంక్లైన్), అల్లం నవ్య శ్రీ(జీడీకే 11 ఇంక్లైన్)లను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంకిత భావంతో పనిచేస్తున్న మహిళా అధికారులను సీఎండీ ఎన్.బలరామ్ ప్రశంసించారు. భవిష్యత్ లో సింగరేణి లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు.




## నీట్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ కోసం పరీక్షా కేంద్రాలను గుర్తించండి




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి** మే 4వ తేదిన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ ) యూజి పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో పరీక్షా కేంద్రాలను గుర్తించి రిపోర్ట్ సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే4న జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ యూజి -2025 పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ అర్హత పరీక్ష కోసం పరీక్ష కేంద్రాలను జిల్లాలో గల కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్కూల్స్, ఆర్మీ స్కూల్స్, ఇంజనీరింగ్ కళాశాలలు, సిబిఎస్ఈ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలను సందర్శించి అందులో ఉన్నంటువంటి మౌలిక వసతులు, చేపట్టాల్సిన చర్యల పై తక్షణమే నివేదిక అందించాలని ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాల ఎంపికకు నియమ నిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పరీక్ష రాసేందుకు వీలుగా బెంచీలు, కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాల పని తీరు, తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, తదితర సౌకర్యాలను పరిశీలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాల పై నివేదిక అందించాలని, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రతి గదికి 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా గదులు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డిఓ వినోద్ కుమార్, డిఈఓ ప్రణీత, డిఐఈఓ జాదవ్ గణేశ్, ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.





గురువారంనాడు మధ్యప్రదేశ్‌లోని దాటియాలో, డా. భగవంత్ రావు, జగద్గురు చక్రవర్తి శ్రీ కల్కి తన గొడుగు మరియు రాజదండంతో మా పీతాంబర (మా బగ్లాముఖి) మరియు మా ధూమావతిని దర్శనం చేసుకున్నారు, ఆ తర్వాత డా. భగవంత్ రావుకు రాష్ట్రీయంగా హిందుస్థాన్‌లో జరిగిన మూడవ జాతీయ సదస్సులో ఘనంగా సత్కరించారు యోధ్య మరియు హిందూ ఉద్భవ్ మాసపత్రిక విడుదలైంది, ఆ తర్వాత డా. భగవంత్ రావ్ జీనే సభను ఉద్దేశించి ప్రసంగించగా, ఆ సమయంలో అక్కడ ఉన్న కార్మికులు చాలా చప్పట్లు కొట్టారు.

# పుస్తకాలే అయన ప్రాణం.. పుస్తకాలయాలే ఆయన లోకం...

పుట్టడం, గిట్టడం సహజం. జీవించినంతలో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం మానవ ధర్మం. కొంతమంది మాత్రమే తమ జీవితంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసి తమ జీవితాన్నే ఫణంగా పెట్టి మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోతారు . అలాంటి వాటిలో...అయ్యంకి వెంకట రమణయ్య ముఖ్యులు. గ్రంథాలయోద్యమం అనగానే గుర్తుకు వచ్చే పేరు ఆయనదే. "పుస్తకాలే ప్రాణంగా...పుస్తకాలయాలే లోకం"గా జీవించిన వ్యక్తి. గ్రంథాలయోద్యమ పితా మహుడుగా, జీవితాంతం గ్రంథాలయాల అభివృద్ధి కోసం, అద్వితీయంగా, అనన్యంగా, అహర్నిశలూ, బహుముఖ సేవలందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి. అయ్యంకి వెంకట రమణయ్య (1890–1979) గ్రంథాలయోద్యమ కారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారు. అయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితా మహుడుగా పేరు గాంచారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండంలో గల కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24న జన్మించారు.

అయన తల్లిదండ్రులు వెంకటరత్నం, మంగమాంబ. తండ్రి వెంకతరత్నం గారు నీటిపారుదల శాఖలో ఉద్యోగి. 1907లోప్రముఖ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి లో భారత స్వాతంత్ర్య సమరంలో యువకులు పాల్గొనాలని ఇచ్చిన ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు విని, చదువుకు స్వస్తి చెప్పి దేశ సేవకు జీవితాన్ని అంకితం చెయ్యటానికి 'రక్షాబంధనం ' కట్టుకొన్నారు.

దేశంలోని పలు సమస్యలకు ముఖ్యకారణం అవిద్య, అజ్ఞానం అని గ్రహించి, అందరినీ విద్యా వంతులుగా, జ్ఞాన వంతులుగా చెయ్యాలని అందుకు గ్రంథాలయాల వ్యాప్తి అవసరమని భావించి ఆ ఉద్యమ వ్యాప్తికి కంకణం కట్టుకొన్నారు. 1910 లో బందరులో "ఆంధ్ర సాహిత్య పత్రిక"ను స్థాపించి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి, ప్రజలను చైతన్య వంతం చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయ వాడలో నిర్వహించారు. 1919, నవంబరు–14న, చెన్నైలో తొలి "అఖిల భారత పౌర గ్రంథాలయం" ను స్థాపించి, మొదటి మహా సభను నిర్వహించారు. అలాగే 'గ్రంథాలయ సర్వస్వం' (త్రైమాసిక), 'ఇండియన్ లైబ్రరీ జర్నల్', 'కౌరడా', 'ప్రకృతి', 'ది ఇండియన్ నేచురోపతి',' 'సహకారం', 'దివ్యజ్ఞాన దీపిక' వంటి పత్రికలను కూడా నడిపారు. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డాడు. 1914లో విజయ వాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధుల గ్రంథాలయ మహా సభలు జరిపి భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘ పక్షాన గ్రంథాలయ సర్వస్వం పత్రికను స్థాపించడానికి తోడ్పడ్డారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు.

1934–1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను అపూర్వమైన స్థాయిలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కార్యదర్శులు నిర్వహించారు. వీరి మూలంగా వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. మూసి వేసినవి పునరుద్ధరించ బడ్డాయి. 1920, 1934లలో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామం పర్యటించారు. అయ్యంకి వెంకట రమణయ్య, దేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు గడించారు. ఆంధ్రభాషాభివర్ధినీ మండలి, ఆంధ్రపరిషత్తు, కళాపీఠము, దివ్యజ్ఞాన చంద్రికామండలి అనే గ్రంథమాలలను స్థాపించి అనేక ఉత్తమ రచనలను తెలుగు పాఠకులకు అందించారు.

గ్రంథాలయోద్యమంలో ఆయన సేవలను గుర్తించి, ఆయన సప్తతి మహోత్సవ సందర్భంగా, గుడివాడలో 'సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదుతో సత్కరించారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించిన రోజును భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి నేషనల్ లైబ్రరీ డే (జాతీయ గ్రంథాలయ వారోత్సవ దినం)"గా దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ1968 నుండి, "జరుపుకొను చున్నారు. ఆయన అనేక గ్రంథాలయ యాత్రలను నిర్వహించి, "ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం" అని చాటి చెప్పారు. భారత ప్రభుత్వం ఆయన గ్రంథాలయ సేవలకు స్పందించి 1972 లో' 'పద్మశ్రీ'తో .గౌరవించింది. గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ విశారద, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు.

1977లో ప్రొఫెసర్ కౌలా అంతర్జాతీయ స్వర్ణపతకం పొందారు. ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు గ్రంథాలయ శాస్త్ర పరీక్షలో ఉత్తమ విద్యార్థికి అయన పేరుతో స్వర్ణ పతకం ఇస్తున్నది. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పడి ప్రతి సంవత్సరం ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. ఆయన తండ్రి వెంకట రత్నం అయ్యంకిలో శ్రీ గంగా పర్వత.వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. వెంకట రమణయ్య 1979, మార్చి 7న మరణించారు.

# ప్రథమ నేపథ్య గాయకుడు

"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యం లో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ విని పించడం సర్వ సాధారణమే. అంతే కాక, ఆంజనేయ, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామా రావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించడం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అన గానే ఆయన యావత్ తెలుగు ప్రజ లందరికీ సుపరిచితులు, సుప్రసి ద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందర కాండ' గీతాలు యావదాంధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడా రు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయ న విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణ రావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్ట మొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటి రాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసిం చిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకు న్నారు. కొన్ని పాటలు రాసి నల్ల పిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసా రు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హను మాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువదిం చారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరా బాదులో తుది శ్వాస విడిచారు.

# వివేకా హత్య కేసు మరో సాక్షి మృతి

కడప, మార్చి 6, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో ప్రధాన సాక్షి చనిపోయారు. వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగన్నఅనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్ ఆస్పత్రిలో చనిపోయారు. వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు రంగన్న ఇంటి వాచ్ మెన్ గా ఉన్నారు. ఈ కేసులో పలుమార్లు రంగన్నను సీబీఐ అధికారులు ప్రశ్నించి స్టేట్ మెంట్ నమోదు చేశారు. వివేకా ఇంటి వాచ్ మెన్ రంగన్నను మొదట ఎవరూ పట్టించుకోలేదు కానీ..సీబీఐకి ఆయన ఇచ్చిన వాంగ్మూలం మాత్రం సంచలనం సృష్టించింది. ఎర్రగంగిరెడ్డి, ఉమా శంకర్ రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి కలిసి వివేకను హత్య చేశారని 164 స్టేట్‌మెంట్‌లో రంగన్న చెప్పారు. ఏ 1 నింది?తుడు దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. ఇదే కేసులో నిందితుడుగా ఉన్న కల్లూరు గంగాధర రెడ్డి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డి మరో అనుమానితు? కూడా అనుమానాస్పదంగా చనిపోయారు. మృతదేహానికి కుట్లు వేసిన..వేయించిన వైద్యులు ఈసీ గంగిరెడ్డి, వైఎస్ అభిషేక్ రెడ్డి కూడా చనిపోయారు. ఇప్పుడు రంగన్న కూడా చనిపోవడంతో సాక్షులంతా వరుసగా చనిపోతున్నారన్న అభిప్రాయం ఏర్పడుతోంది. వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి కావడం వల్ల ఆయనకు 1+1 భద్రత కల్పించారు. కీలక సాక్షులంతా చనిపోతున్నా..కేసుల్లో మాత్రం అడుగు ముందుకు పడటం లేదని ఆరు నెలల్లో కేసు విచారణ పూర్తి చేయాలని వైఎస్ సునీత ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసు సీబీఐ కోర్టుకు బదిలీ అయి రెండేళ్లయినా విచారణ ప్రారంభంకాలేదని . అందువల్ల 6 నెలల్లో విచారణ పూర్తయ్యేలా ఆదేశాలివ్వాలంటూ సునీతారెడ్డి పిటిషన్లో కోరారు. ఈ కేసు విచారణ జరగకుండా నిందితులు ప్రయత్నిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.గౌతం వాదనలు వినిపించారు. ప్రస్తుతం ఇంకా కోర్టు నుంచి కాగితాలు తీసుకునే దశలోనే ఉన్నారని సునీత వాదిస్తున్నారు. దాదాపు 13 లక్షల ఫైళ్లు ఉండగా అందులో 13,000లు కూడా తెరవలేదన్నారు. ఇంత ఆలస్యంగా ఉంటే కేసు విచారణ ఏళ్లు పడుతుందన్నారు. ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధుల కేసులపై ప్రత్యేక విచారణ చేపట్టేలా చూడాలంటూ సుప్రీంకోర్టు అన్ని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్రత్యేక ధర్మాసనం ప్రజాప్రతినిధుల కేసుల పురోగతిని పర్యవేక్షిస్తోందని ఈ పిటిషన్ కూడా ప్రత్యేక ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. త్వరలో ఈ పిటిషన్ విచారణకు రానుంది. 2019 ఎన్నికలకు ముందు పులివెందులలోని తన నివాసంలోనే వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. మొదట ఆయనకు గుండెపోటు వచ్చిందని... రక్తపు వాంతులు చేసుకున్నారని ప్రచారం చేశారు. అయితే ఆయనను చాలా దారుణంగా నరికి చంపారని ఫోటోలు వెలుగులోకి వచ్చాయి. దాంతో తర్వాత హత్యకేసుగా మారింది. ఈ వ్యవహారంలో ఇప్పటికీ విచారణ పూర్తి

# రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార

కడప, మార్చి 6, రాష్ట్రంలో రేషన్‌కార్డు దారులకు కందిపప్పు పంపిణీ చేయడంలేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారని రేషన్ కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల కందిపప్పు పంపిణీలో కోత విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత మూడు, నాలుగు నెలల నుండి ఇదే తీరు ఉందంటున్నారు. కందిపప్పు ఇచ్చినా అరకొరగానే కొంత మందికే అందుతుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ రేషన్ కార్డులకు ప్రతినెలా రేషన్ సరుకులు అందిస్తున్నారు. బియ్యం, పంచదార, కందిపప్పు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆచరణలో మాత్రం పంపిణీ జరగటం లేదు. ఈనెల కూడా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు లేదని, అడగొద్దని రేషన్ డీలర్లు చెబుతున్నారు.గత మూడు, నెలల నుంచి ఇదే తంతు, ఈనెల కూడా కందిపప్పు పంపిణీ లేదని రేషన్ కార్డుదారులు అసంతృప్తితో ఉన్నారు. కందిపప్పు ఇస్తారేమోనని ప్రతి నెలా ఎదురు చూస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వం బియ్యం, పంచదార, కందిపప్పు ఇస్తామని చెప్పినప్పటికీ, కేవలం బియ్యం, పంచదారే అందుతుందని వినియోగదారులు అంటున్నారు. కందిపప్పు తీసుకుని కొన్ని నెలలు అవుతోందని, ప్రతినెలా అడిగినప్పుడు కందిపప్పు లేదని సమాధానం వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం, పంచదార మాత్రమే తమకు వచ్చిందని, వాటినే రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్నామని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు.రేషన్ కార్డు దారులకు కందిపప్పును రూ.67కు అందించేవారు. బహిరంగ మార్కెట్లో కేజీ కందిపప్పు ధర రూ.167 నుంచి రూ.180 వరకు ఉంటుంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసుకోలేకపోతున్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

ఏపీలో 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 90 లక్షల కార్డులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 17,941 అంత్యోదయ అన్న యోజన కార్డుదారులు, మరో 1,36,420 పీహెచ్‌హెచ్ కార్డుదారులు గత ఆరు నెలలుగా రేషన్ తీసుకోవడం లేదు. ఈ కార్డులను తొలగిస్తే రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా దాదాపు 1.60 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసే వెసులుబాటు ఉంటుందని నిర్ణయించారు.ఇప్పటికే రాష్ట్రంలో 3.30 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కొత్త రేషన్ కార్డుల కోసం 30,611 దరఖాస్తులు, కార్డుల స్ప్లిట్ (విభజన) కోసం 46,918 దరఖాస్తులు, కుటుంబ సభ్యుల యాడింగ్ (కార్డులో చేర్చడం) కోసం 2,13,007 దరఖాస్తులు, తొలగింపు కోసం 36,588 దరఖాస్తులు, అడ్రస్ మార్పు కోసం 8,263 దరఖాస్తులు, సరెండర్ కోసం 685 దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

# ఉద్యోగులకు మరో బంపర్ ఆఫర్

గుంటూరు, మార్చి 6, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి అనేక హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే. మహిళల, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు ఇలా అన్ని వర్గాల వారికి చంద్రబాబు హామీలు ప్రకటించారు. ఇక టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఉద్యోగుల సంక్షేమానికి కూడా పెద్దపీట వేస్తోంది.

ఈ క్రమంలోనే ఏపీ వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వైద్యారోగ్య శాఖలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అదనంగా 5 క్యాజువల్ లీవులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం.మరోవైపు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటివరకు పరిమిత క్యాజువల్ లీవ్స్ మాత్రమే అందుబాటులో ఉండేవి. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో తమకు క్యాజువల్ లీవ్స్ పెంచాలంటూ వైద్యారోగ్య శాఖలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ నేపథ్యంలో ఉద్యోగుల విజ్ఞప్తిని పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. అదనంగా వారికి ఐదు క్యాజువల్ సెలవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది.ఇక ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పరిమిత సంఖ్యలో క్యాజువల్ లీవ్స్ ఉండటంతో ఇంతకాలం అనేక ఇబ్బందులు పడ్డామని.. ఇప్పుడు అదనంగా ఐదు రోజులు క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలనే నిర్ణయంతో తమకు ఎంతో ఉపశమనం కలుగుతుందంటున్నారు. ఈ నిర్ణయం ఉద్యోగుల వృత్తి నిబద్ధతను పెంచుతుందంటన్నారు. ఈ కొత్త పాలసీ గురించి ప్రభుత్వం వీలైనంత త్వరగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు. ఈ నిర్ణయం ద్వారా అనేక మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని, వారి పనితీరు మెరుగుపడుతుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 4 సీట్లకు 10 మంది...

విజయవాడ, మార్చి 6, ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఐదు స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇందులో ఒక స్థానం నుంచి నాగబాబు పోటీ చేస్తారని.. ఆయనకు మంత్రి పదవి ఖాయమని జోరుగా ప్రచారం జరిగింది. గతంలో చంద్రబాబు, పవన్ ఈ విషయాన్ని అధికారికంగా కన్ఫార్మ్ చేశారు కూడా.రెండు రోజులుగా నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వట్లేదని, దాని బదులు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తారని కొందరు.. రాజ్యసభ ఎంపీగా పంపిస్తారని మరికొందరు ప్రచారం మొదలుపెట్టారు. ఇంకొందరు అయితే.. ఈసారి నాగబాబుకు ఎలాంటి అవకాశమే లేదని ఎత్తుకున్నారు. దీంతో జనసేనలో కంగారు కనిపించింది. కట్ చేస్తే ఈ ప్రచారానికి.. ఒక్క స్టేట్‌మెంట్‌తో పవన్ ఫుల్ స్టాప్ పెట్టేశారు. నాగబాబును అధికారికంగా జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు.రెండురోజులుగా నాగబాబుపై రకరకాల కథనాలు వినిపించాయ్. నాగబాబుకు ఈసారి కూడా మొండిచేయే అనే ప్రచారం కూడా తెరమీదకు వచ్చింది. జనసేన స్టేట్‌మెంట్‌తో అన్ని రకాల ఊహాగానాలకు చెక్ పడింది. నాగబాబుకు లైన్ క్లియర్ అయింది. నిజానికి నాగబాబు గత సార్వత్రిక ఎన్నికల్లోనే అనకాపల్లి పార్లమెంటు నుంచి పోటీ చేయాలనుకున్నారు.అయితే చివరి నిమిషంలో ఆ స్థానాన్ని బీజేపీ తీసుకుంది. సీఎం రమేశ్ కు కేటాయించింది. దీంతో నాగబాబును రాజ్యసభకు పంపిస్తారని భావించారు. అయితే అదీ కుదరలేదు. నాగబాబును ఎమ్మెల్సీగా చేసి.. కేబినెట్ లోకి తీసుకుంటామని రాజ్యసభ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ప్రకటించారు. ఇప్పుడు జరగబోయేది అదే.నాగబాబు ఎమ్మెల్సీగా ఎన్నుకున్న తర్వాత.. మంత్రివర్గంలో ఆయనకు చోటు కల్పించబోతున్నారని తెలుస్తోంది. ఐతే ఆయనకు ఏ శాఖ కేటాయిస్తారనేది హాట్‌టాపిక్ అవుతోంది. ఉగాది పండుగలోపు నాగబాబు.. కేబినెట్‌లోకి అడుగు పెడతారంటూ ప్రచారం జరుగుతోంది.ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడు పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది. దీంతో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 10 వరకు నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.అసెంబ్లీలో ప్రస్తుతం ఉన్న బలాబలాలను చూస్తే.. ఐదు స్థానాలు కూటమి పార్టీలు గెలుచుకోవడం ఖాయం. జనసేనకు ఒక స్థానం కేటాయించగా.. మిగిలిన నాలుగు స్థానాల్లో ఎవరు అనేది కూడా ఇప్పుడు హాట్‌టాపిక్ అవుతోంది. కూటమి పార్టీల్లో ఎమ్మెల్సీ సీట్లను ఆశిస్తున్న వాళ్ల సంఖ్య భారీగానే కనిపిస్తోంది. దీంతో ఈ స్థానాల్లో ఎవరికి అవకాశం దక్కబోతోంది. టీడీపీ ఖాతాలోనే నాలుగు చేరతాయా లేదంటే.. బీజేపీ ట్విస్ట్ ఇస్తుందా అనే ప్రచారం కూడా నడుస్తోంది.పిఠాపురంలో పవన్‌కు సీటు త్యాగం చేసిన వర్మ, మైలవరంలో వసంత కృష్ణప్రసాద్ కోసం పక్కకు జరిగిన దేవినేనితో పాటు.. రాయలసీమ నుంచి కీలక నేతలు.. సిట్టింగ్ ఎమ్మెల్సీలు కూడా ఈసారి రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 4 సీట్లకు టీడీపీలో 10 రెట్ల పోటీ కనిపిస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇలాంటి టైమ్‌లో ఆ నాలుగు స్థానాల్లో.. ఒకటి బీజేపీ కూడా ఆశిస్తుందనే ప్రచారం జరుగుతోంది.గతంలో రాజ్యసభ ఎంపీల వ్యవహారంలో.. రెండు టీడీపీ ఖాతాలో చేరగా.. ఒకటి బీజేపీ తీసుకుంది. ఐతే ఇప్పుడు ఎమ్మెల్సీ స్థానాల విషయంలోనూ కమలం పార్టీ పట్టు పడుతోంది నిజమే అయితే.. టీడీపీకి మిగిలేవి మూడు స్థానాలు మాత్రమే. దీంతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారి తీసే అవకాశాలు ఉన్నాయ్.కోటా ఎమ్మెల్సీ సీట్ల వ్యవహారం ఇంట్రెస్టింగ్‌గా మారిన వేళ.. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. కేంద్రం పెద్దలతో ఎమ్మెల్సీ స్థానాల వ్యవహారం చర్చకు వచ్చే చాన్స్ ఉందా.. అదే జరిగితే టీడీపీలో ఆశలు పెట్టుకున్న వాళ్ల పరిస్థితి ఏంటన్నది హాట్‌టాపిక్ అవుతోంది.

# గంజాయి స్వాధీనం



కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణ చేస్తున్న 8 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్ పి జి.బిందుమాధవ్ తెలిపారు. భారీఎత్తున 492 కెజీల గంజాయి, రెండు లక్షల డబ్బై ఎనిమిది వేల రూపాయలు నగదు, రెండు వాహనాలు నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలియచేసారు. నిందితులను పట్టుకోవడం లో చురుకుగా వ్యవహరించిన జగ్గంపేట సి.ఐ. వై.ఆర్.కె. శ్రీనివా స్, ఎస్.ఐ. టి. రఘునాధరావు, గండేపల్లి ఎస్.ఐ. శివనాగబాబు, కిర్లంపూడి ఎస్.ఐ. జి.సతీష్, హెచ్.సి. సీలం, పి.సి. సత్యనారాయ ణ, హోం గార్డు అనిల్, వీరబాబు, సోమరాజు, సూరిబాబులను పోలీస్ ఉన్నత అధికారులు అభినందించారు. పెద్దాపురం ఎస్.డి.పి.వో. శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సి.ఐ.వై.ఆర్.కె. శ్రీనివాస్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పైనాన్సర్ ఇన్వెస్టిగేషన్ కూడా చేయడం జరుగుతుంది.

# నాచారంలో బిజెపి సంబరాలు



**ప్రజా బలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గ మార్చి 6:** ఎమ్మెల్సీ ఎన్నికల లో బిజెపి విజయం సాధించిన సందర్భంగా నాచారం డివిజన్ లో బిజెపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అభిషేక్ గౌడ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బిజెపి డివిజన్ మాజీ అధ్యక్షులు ప్రకాష్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, బిజెపి నాయకులు రాజిరెడ్డి, రవికాంత్, అంజి, ప్రతాప్ రెడ్డి, అమర్ నాథ్, పువ్వాడ సత్యనారాయణ, రాఘవేంద్ర రెడ్డి, పాదం వెంకటేష్, బాలు, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, కృష్ణ, శేఖర్, రమేష్, శేఖర్ గుప్తా, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, నవీన్, నారాయణ రెడ్డి, రాజు, మూల వెంకటేష్, దర్శనలా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ గూడెం రాములు యాదవ్





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 06(ప్రజాబలం)**వికారాబాద్ జిల్లా/మర్పల్లి :తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ ,మండల అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ ,పేర్కొన్నారు.మర్పల్లి మండలంలోని బిల్కల్ గ్రామంలో ఎన్ ఆర్ ఈ జీ ఎస్, పథకం కింద 13 లక్షల రూపాయల తో మంజూరైన సీసీ రోడ్లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాములు యాదవ్ ,అధ్యక్షుడు తుమ్మల సురేష్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి సీనియర్ నాయకులు కలి మోదీ న్, తో కలిసి బుదవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలోనే అత్యున్నత పదవిలో మన స్పీకర్ ప్రసాద్ కుమార్ ఉండడంతో మండలానికి అధిక నిధులు మంజూరు చేస్తున్నారన్నారు.మండలంలో మరిన్ని అభివృద్ధి పనులకు కార్యచరణ రూపొందిస్తున్నామని త్వరలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు త్వరలో నిధులు మంజూరు అవుతాయని వారు తెలిపారు. ప్రారంభోత్సవానికి వచ్చిన నాయకులకు శాలువా కప్పి వారిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సురేష్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచన్న,పట్నం అశోక్,గంగ్రపు గోపాల్, ఈశ్వర్, కల్కోడ ప్రభాకర్, అబ్రహం, , మధుకర్ రెడ్డి, రాకేష్, లక్ష్మారెడ్డి సిరిపురం ,పట్లూరు రాజు మాజీ ఎంపీటీసీ, ,మాజీ సర్పంచ్ గడిలా ప్రభాకర్ బిల్కాల్ విలజ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కంటెస్టట్ ఎంపీటీసీ అనంతి , కంటేఎస్ట్ సర్పంచ్ ప్రమోద్,శ్రీనివాస్ గౌడ్, అశోక్ ,కుమార్, కృష్ణ, యాదయ్య, రాజునర్సింలు,శ్రీనివాస్ ,.వెంకటేశం, . వెంకటేశం తది తరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.

### క్షేత్ర స్థాయిలో ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలి.

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.




**మెదక్ మార్చి-06 ప్రజాబలం ప్రతినిధి** :-ఈ వేసవిలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా, క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ హాలులో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై అదనపు కలెక్టర్ నగేష్, జడ్పి సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ఎస్సీ ట్రాన్స్కో శంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్స్ రవీంద్ర కుమార్, శివ దయాల్ మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సంబంధించి గ్రామస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని గ్రామాల్లో, మండలాల్లో ,మున్సిపాలిటీల్లో త్రాగునీటి ఎద్దడి లేకుండా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగలన్నారు . త్రాగునీటి పంపిణీలో సమస్యలు ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి గృహిణులను అడిగి నీటి సరఫరా గురించి అడిగి

వేసవిని దృష్టిలో పెట్టుకొని పక్కా ప్రణాళికతో ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఎక్కడైనా పైప్ లైన్ పాడైతే సంబంధిత శాఖ అధికారులతో పనులు చేయించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రెటరీలు గ్రామాల్లో ప్రతినిత్యం పర్యటించాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఎట్టి పరిస్థితుల్లో వేసవిలో నీటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు సాగాలన్నారు

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు.

వాతావరణ అసమతుల్యత వల్ల వర్షాలు పడే అవకాశం ఉంటే టార్ ఫ్లైన్ సీట్స్ సిద్ధం చేసుకోవాలన్నారు.

వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు పనిచేసే దగ్గర త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

జిల్లా ఆస్పత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని మందులు అందుబాటు ఉంచుకోవడంతోపాటు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని %ూ=ూ% ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకుని సన్ స్ట్రోక్ సోకిన వారిని ప్రాథమిక చికిత్సలు ఎలా చేయాలనే దానిపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వర్కర్స్ కు వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని

పని వేళలో మార్పులు చేయాలన్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాపై మున్సిపాలిటీలు, గ్రామాలలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఎదుర్కొంటే

విద్యుత్ విభాగం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు, డబ్ల్యూ ఎస్, గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజుగారిని పట్టించుకొనేవాడెవరు...

విజయనగరం, మార్చి 6, లుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నేత అశోక్ గజపతి రాజు ఇక రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే కనిపిస్తుంది. ప్రస్తుతమున్న రాజకీయాల్లో తాను పనికి రానని ఆయన డిసైడ్ అయ్యారు. అందుకే తన వారసురాలిని పాలిటిక్స్ లోకి దించారు. అశోక్ గజపతి రాజు చంద్రబాబు నాయుడుతో సమానమైన రాజకీయ అనుభవం ఉన్న నేత. . విజయనగరం జిల్లా అంటేనే టీడీపీలో మొదట గుర్తొచ్చేది ఆయన పేరే. అలాంటిది అశోక్ గజపతి రాజు పేరు పూర్తిగా కనుమరుగైంది. ఆయన ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే ఉంటున్నారని చెబుతున్నారు. తనకు ఎలాంటి పదవులు వచ్చే అవకాశం లేదని అశోక్ గజపతి రాజు దాదాపు ఫిక్స్ అయినట్లే కనపడుతుంది. ప్రస్తుతం అశోక్ గజపతి రాజును పార్టీ కూడా పట్టించుకోకపోవడం లేదు. ఆయన పేరు కూడా ఎక్కడా నేతల నోటి నుంచి ప్రస్తావనకు రావడం లేదు. ఆయన ఊసే లేదు. రాజ్యసభకు పంపుతారని అనుకున్నా ఆ పేరు కూడా పరిశీలనలోకి తీసుకోవడం లేదు. అశోక్ గజపతి రాజు శకం రాజకీయంగా ముగిసినట్లేనన్నఆయన అభిమానులు భావిస్తున్నారు. 2019 ఎన్నికలలో ఓటమి తర్వాత అశోక్ గజపతి రాజులో కొంత నైరాశ్యం అలుముకుంది. దీంతో పాటు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ట్రస్ట్ విషయంలోనూ జోక్యం చేసుకుంది. న్యాయస్థానాలకు వెళ్లి పోరాడాల్సి వచ్చింది. టీడీపీ ఆ సమయంలో కొంత వరకూ మద్దతుగా ఉన్నప్పటికీ ఎన్నికల తర్వాత మాత్రం ఆయన ఊసే వినిపించడంలేదు విజయనగరంలో మొన్నటి ఎన్నికల్లో తన కుమార్తె ఆదితి గజపతిరాజు గెలవడంతో భవిష్యత్ రాజకీయాలను ఆమెకే అశోక్ గజపతి రాజు అప్పగించినట్లు చెబుతున్నారు. వయసు కూడా మీద పడటంతో పాటు ప్రస్తుతం టీడీపీలో నెలకొన్న పరిస్థితులను బట్టి తమ మాట చెల్లుబాటు కాదని భావించిన అశోక్ గజపతి రాజు డిసైడ్ అయినట్లే కనిపిస్తుంది. అందుకే కూటమ ప్రభుత్వం ఏర్పాటయి పదినెలలు గడుస్తున్నా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసే ప్రయత్నం కానీ, అమరావతికి కూడా రాలేదంటే ఆయన పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే చెబుతున్నారు. అప్పుడప్పుడు తన కుమార్తె ఆదితి గజపతిరాజుకు సలహాలు ఇస్తూ కాలం గడుపుతున్నారంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు అశోక్ గజపతి రాజు పేరు ప్రముఖంగా వినిపించింది. ఆయనకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి గవర్నర్ పదవి ఇస్తారన్న ప్రచారం కూడా బాగానే సాగింది. కానీ ఇప్పుడు గవర్నర్ పదవి కూడా దక్కే అవకాశం లేదంటున్నారు. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుండటంతో సీనియర్ నేత అయిన అశోక్ గజపతి రాజును ఇక పట్టించుకునే సమయం, తీరిక పార్టీ నాయకత్వానికి ఉండకపోవచ్చు. ఆయన కూడా వచ్చి తనకు పదవి కావాలని కోరకపోవచ్చు. ఆయన రాజుగారు. తనకు పిలిచిపదవి ఇస్తే ఓకే గాని, అడిగి తెచ్చుకోవడం తన ఇంటా వంటా లేదంటున్నారు. మొత్తం మీద అశోక్ గజపతి రాజు రాజకీయ శకం ముగిసినట్లేనని అనుకోవాలి.

## ఆ ఇద్దరూ దూరమేనా

శ్రీకాకుళం, మార్చి 6, వైఎస్సార్ కాంగ్రెస్పార్టీకి సిక్కోలు సీనియర్ నేతలు దూరమైనట్టేనా? దాదాపు వారు ఒక నిర్ణయానికి వచ్చారా? ఇక పార్టీలో ఉండలేమని సంకేతాలు పంపారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఉత్తరాంధ్ర రీజినల్ స్థాయి సమావేశానికి సీనియర్ నేతలుగా ఉన్న ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం గైర్హాజరయ్యారు. కనీసం వారి కుమారులైన సమావేశానికి రాలేదు. దీంతో వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండాలని తేలిపోయింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ధర్మాన ప్రసాదరావు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. తమ్మినేని సీతారాం యాక్టివ్ గా ఉన్న సమయంలో ఆమదాలవలస నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పటినుంచి ఆయన కూడా పొలిటికల్ గా సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ గా కురసాల కన్నబాబు నియమితులయ్యారు. ఆయన నిర్వహించిన సమావేశానికి సైతం గైర్హాజరు కావడం విశేషం. ధర్మాన ప్రసాదరావు సీనియర్ మోస్ట్ లీడర్. ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ నేత. వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ప్రధాన అనుచరుడుగా కొనసాగారు. అందుకే 2014 ఎన్నికల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. అయినా సరే అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాలా యాక్టివ్ గా పని చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చారు. 2019 ఎన్నికల్లో రెండోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. పార్టీ అధికారంలోకి రావడంతో మంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ జగన్ మోహన్ రెడ్డి షాక్ ఇచ్చారు. మనస్థాపానికి గురయ్యారు. తొలి మూడేళ్లు పెద్దగా యాక్టివ్ గా లేరు. మంత్రి పదవి ఇచ్చినా పెద్దగా సంతృప్తి చెందలేదు. ఈ ఎన్నికల్లో ఓడిపోయేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమైపోయారు. దాదాపు ఆ పార్టీతో తెగదింపులు చేసుకునేదాకా పరిస్థితి వచ్చింది. తమ్మినేని సీతారాం తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. మధ్యలో ప్రజారాజ్యం పార్టీలో చేరిన ఆయన తిరిగి టిడిపి గూటికి చేరారు. కానీ ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఆముదాలవలస నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. 2019లో రెండోసారి ఆ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. మంత్రి పదవి ఆశించారు. కానీ జగన్మోహన్ రెడ్డి స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించారు. అయితే ఈ ఎన్నికల్లో తన బదులు తన కుమారుడికి ఛాన్స్ ఇవ్వాలని తమ్మినేని సీతారాం కోరారు. కానీ జగన్ మాత్రం తమ్మినేని సీటు ఇచ్చారు. కానీ తమ్మినేని ఓడిపోవడంతో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు తప్పించారు. ఆయన స్థానంలో ద్వితీయ శ్రేణి నాయకుడు చింతాడ రవికుమార్ కు బాధ్యతలు ఇచ్చారు. దీనిని వ్యతిరేకించారు తమ్మినేని. పార్టీ కార్యక్రమాలకు గైరహాజరవుతూ వచ్చారు. ఇప్పుడు కీలకమైన ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ నిర్వహించిన సమావేశానికి సైతం గైర్హాజరయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఇద్దరు నేతలు సీనియర్లు. కానీ వీరి పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. తెలుగుదేశం పార్టీలో ఛాన్స్ లేదు. జనసేనలో చేరేందుకు అవకాశం ఉంది. మరోవైపు బిజెపి సైతం వీరిని ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఆ పార్టీకి జిల్లాలో పెద్దగా బలం లేదు. అందుకే ఈ ఇద్దరు నేతలు తమ వారసుల కోసం సరైన నిర్ణయం తీసుకునేందుకు వేచి చూస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల ముందు ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

## న్యూజిలాండ్ వర్సెస్ ఇండియా.. టోర్నీ ఫైనల్ ఖరారు

ముంబై, మార్చి 6,ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ ప్రత్యర్థి ఎవరో తేలింది. పాత కాపు కివీస్ తో అమీతుమీ తేల్చుకోనుంది. బుధవారం టోర్నీ రెండో సెమీస్ లో దక్షిణాఫ్రికాపై 50 పరుగులతో విజయం సాధించిన న్యూజిలాండ్ దూసుకెళ్లింది. లాహోర్ లోని గఢాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్.. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసింది. ఓపెనర్ రచిన్ రవీంద్ర సెంచరీ (101 బంతుల్లో 108, 13 ఫోర్లు, 1 సిక్సర్) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. అతనితో పాటు మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ స్టన్నింగ్ శతకం (94 బంతుల్లో 102, 10 ఫోర్లు, 2 సిక్సర్లు) సత్తా చాటాడు. దీంతో న్యూజిలాండ్ టోర్నీ చరిత్రలో హైయెస్ట్ స్కోరు నమోదు చేసిన జట్టుగా రికార్డు నమోదు చేసింది. ఇక ఛేదనలో చోకర్స్ అనే ముద్రకు సఫారీలు న్యాయం చేశారు. 50 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగులు చేశారు. దీంతో 50 పరుగులతో కివీస్ నెగ్గింది. విధ్వంసకర బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అద్భుతమైన ఇన్నింగ్స్ (67 బంతుల్లో 100 నాటౌట్, 10 ఫోర్లు, 4 సిక్సర్లు)తో జట్టును గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు. టోర్నీ చరిత్రలో అత్యంత వేగంగా సెంచరీ చేసినా లాభం లేకుండా పోయింది. అలాగే రస్సీ వాన్ డర్ డస్సెన్ (66 బంతుల్లో 66, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) సత్తా చాటాడు. మిషెల్ శాంట్నర్ మూడు వికెట్లతో కెప్టెన్ గా జట్టును ముందుండి నడిపించాడు. ఈమ్యాచ్ లో గెలిచిన కివీస్ ఈనెల 9న దుబాయ్ లో జరిగే ఫైనల్లో భారత్ ను ఢీకొననుంది. భారీ టార్గెట్ ను చూసి ప్రొటీస్ ముందే చేతులెత్తేసింది. ఏ దశలోనూ మ్యాచ్ ను ఛేజ్ చేస్తుందని అనిపించలేదు. ఆరంభంలోనే ర్యాన్ రికెల్టన్ (17) వికెట్ కోల్పోయిన సఫారీలు వెనుకంజ వేశారు. ఆ తర్వాత కెప్టెన్ టెంబా బవుమా (71 బంతుల్లో 56, 4 ఫోర్లు, 1 సిక్సర్) తో కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నాన్ని డస్సెన్ చేశాడు. వీరిద్దరూ చాలా నెమ్మదిగా ఆడటంతో స్కోరు వేగం మందగించింది. ముఖ్యంగా బవుమా జిడ్డుగా ఆడుతూ సహచర బ్యాటర్ పై ఒత్తిడి పెంచాడు. మరోవైపు డస్సెన్ మాత్రం కాస్త దూకుడుగా ఆడారు. నాకౌట్ లో ఛేజ్ చేసే సమర్థవంతమైన ప్రణాళికను ప్రొటీస్ రూపొందించ లేకపోయింది. వీరిద్దరూ 105 బంతుల్లో 105 పరుగులు జత చేశారు. ఈ క్రమంలో 64 బంతుల్లో బవుమా, డస్సెన్ 51 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత స్కోరు వేగాన్ని పెంచే క్రమంలో బవూమా ఔటయ్యాడు. జిడ్డు బ్యాటింగ్ కు తోడు, మిడిలార్డర్ వైఫల్యం సఫారీల కొంపముంచింది. ఐడెన్ మార్క్ రమ్ (31), హెన్రిచ్ క్లాసెన్ (3), వియాన్ మల్డర్ (8) విఫలమయ్యారు. అయితే మరో వైపు డేవిడ్ మిల్లర్ మాత్రం చివరికంటా పోరాటం చేసి, ఓటమి అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లు సమష్టిగా రాణించి, బ్యాటింగ్ ప్యారడైస్ పై ప్రొటీస్ ను కట్టడి చేశారు. మిగతా బౌలర్లలో మ్యాట్ హెన్రీ, గ్లెన్ ఫిలిప్స్ లకు రెండు, మిషెల్ బ్రేస్ వెల్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు. ఇక ఈ మ్యాచ్ లో విజయం ద్వారా.. ప్రొటీస్ పై నాకౌట్ లో అజేయ రికార్డును కివీస్ నిలబెట్టుకుంది. మరోవైపు గ్రూప్-ఏ నుంచి ప్రాతినిథ్యం వహించిన రెండు జట్లు భారత్, కివీస్ ఫైనల్ కు చేరుకున్నాయి. దీంతో 2000 టోర్నీ ఫైనల్ మరోసారి రిపీట్ అయిందని పలువురు భావిస్తున్నారు. ఆ ఎడిషన్ లో భారత్ పై విజయం సాధించి, కివీస్ టోర్నీని నెగ్గింది. దీంతో ఆదివారం మ్యాచ్ లో విజయం సాధించి, ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ భావిస్తోంది.

## వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడపై మరో కేసు



గుంటూరు వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మీద మరో కేసు నమోదయింది. గుంటూరు నగరం పాలెం పోలీస్ స్టేషన్ లో దువ్వాడపై మాణిక్యాల రావు ఫిర్యాదు చేసారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేసారు. మాణిక్యాల రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

## రియల్ వార్ గా మారుతున్న ట్రేడ్ వార్

గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన డొనాల్డ్ ట్రంప్. ఇప్పుడు దేశాన్ని ఆ దిశగా మార్చేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఖర్చుల తగ్గింపుపై దృష్టి పెట్టారు. మరోవైపు వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను పెంచుతున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై సుంకాలను 25 శాతం పెంచారు. మార్చి 4వ తేదీ నుంచి సుంకాల పెంపు అమలులోకి వచ్చింది. అయితే దీనిపై స్పందించిన చైనా డబ్ల్యూటీసీలో పిటిషన్ వేస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకు ఆదిశగా అడుగు వేయలేదు. దీంతో ట్రంప్.. మొదట సుంక 10 శాతం పెంచుతామని తెలిపారు. ఇప్పుడు దానిని రెట్టింపు చేశారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం స్పందించింది. ఈమేరకు ఎక్స్లో ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా చైనాతో సమానంగా సంప్రదింపులు జరపాలని రాయబార కార్యాలయం నొక్కి చెప్పింది. “ఫెంటానిల్ సమస్యను అమెరికా నిజంగా పరిష్కరించుకోవాలనుకుంటే, ఒకరినొకరు సమానంగా చూసుకోవడం ద్వారా చైనాతో సంప్రదించడమే సరైన పని అని పేర్కొంది. అమెరికా యుద్ధాన్ని కోరుకుంటే, అది సుంకాల యుద్ధం అయినా, వాణిజ్య యుద్ధం అయినా లేదా మరేరకమైన యుద్ధంఅయినా పోరాడటానికి సిద్ధమే' అని పోస్టులు స్పష్టం చేసింది. చైనా దిగుమతులపై సుంకాల పెంపునకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఫెంటానిల్ సమస్యను తోసిపుచ్చింది. తన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి చైనా తీసుకున్న చర్యలు చట్టబద్ధమైనవి, అవసరమైనవని మంత్రిత్వ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. అమెరికన్ ప్రజల సద్భావన దృక్పథంతో ఫెంటానిల్ సమస్యను పరిష్కరించడానికి అమెరికాకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా తెలిపింది. కానీ, అమెరికా చైనాపై నిందలు మోపడానికి యత్నిస్తోందని ఆరోపించింది. సుంకాల పెంపుతో చైనాపై ఒత్తిడి, బ్లాక్మెయిల్చేయడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. వారు తమకు సహాయం చేసినందుకు మమ్మల్ని శిక్షిస్తున్నారు. ఇది అమెరికా సమస్యను పరిష్కరించదని స్పష్టం చేసింది. అమెరికా, చైనా మధ్య మొదలైన ట్రేడ్ వార్.. రియల్ వార్కు దారి తీస్తుందా అన్న చర్చ జరుగుతోంది. అమెరికా చర్యలకు దీటుగా చైనా స్పందించడం చూస్తుంటే ఎక్కడా తగ్గేది లేదు అన్నట్లుగా చైనా ఉంది. ఈ నేపథ్యంలో ట్రేడ్ వార్ ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది అమెరికా వ్యతిరేక దేశాలను ఏకం చేస్తుందని అభిప్రాయపడుతున్నారుట్రంప్ పరిపాలన చైనా వస్తువులపై అదనంగా 10 శాతం సుంకాన్ని విధించింది, ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతానికి జోడించబడింది. ఈ సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఇదే అంశంపై కెనడా, మెక్సికో నుంచి దిగుమతులపై కూడా ఇలాంటి సుంకాలు వర్తింపజేయబడ్డాయి. ఈ చర్యలు వాణిజ్య ఉద్రిక్తతలను పెంచాయి, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి మరియు ఇప్పటికే దీర్ఘకాలిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్న అమెరికన్లకు ఖర్చులను పెంచుతాయి. ఫెంటానిల్, దాని పూర్వగామి రసాయనాల ప్రవాహాన్ని అరికట్టడానికి అగ్ర మూడు యూఎస్ వాణిజ్య భాగస్వాములు తగినంతగా చేయలేదని ట్రంప్ ఆరోపించిన తర్వాత, వార్షిక వాణిజ్యంలో దాదాపు 2.2 ట్రిలియన్లకు అంతరాయం కలిగించే సుంకాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇక తన ఆరువారాల పాలనపై కాంగ్రెస్ ముందు మాట్లాడిన ట్రంప్, ఏప్రిల్ 2న మరిన్ని సుంకాలను అమలు చేస్తామని ప్రకటించారు, వాటిలో 'పరస్పర సుంకాలు' మరియు దీర్ఘకాలిక వాణిజ్య అసమతుల్యతలను పరిష్కరించడానికి ఉద్దేశించిన ఇతర నాన్?టారిఫ్ చర్యలు ఉన్నాయి. 'ఇతర దేశాలు దశాబ్దాలుగా మనపై సుంకాలను ఉపయోగిస్తున్నాయి, ఇప్పుడు మన వంతు వచ్చింది' అని ట్రంప్ అన్నారు, భారతదేశం, దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్, చైనా, ఇతర దేశాలు అమెరికా వస్తువులపై విధించిన అధిక సుంకాలను ప్రస్తావించారు. అమెరికా సుంకాలపై చైనా ప్రతిస్పందన మరింత జాగ్రత్తగా ఉంది, కానీ దాని స్పందన తక్కువ కాదు. అమెరికా విధించిన 10% సుంకాలను చైనా 'వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు' అని వ్యాఖ్యానిస్తూ వ్యతిరేకించింది. చైనా ఇంకా పూర్తి స్థాయి ప్రతీకార సుంకాలను ప్రకటించలేదు, కానీ చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ సుంకాలను ప్రపంచ వాణిజ్య సంస్థలో సవాలు చేస్తామని పేర్కొంది, ఇది అంతర్జాతీయ వాణిజ్య నియమాలను ఉల్లంఘిస్తుందని ఆరోపించింది. చైనా అధికారులు 'తగిన ప్రతిచర్యలు' తీసుకుంటామని హెచ్చరించారు, ఇందులో అమెరికా ఉత్పత్తులపై సుంకాలు, ఎగుమతి నియంత్రణలు, లేదా యువాన్ (చైనా కరెన్సీ) విలువను తగ్గించడం వంటివి ఉండవచ్చు. చైనా ఈ విషయంలో ట్రంప్తో సంభాషణల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు, ఎందుకంటే చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పెద్ద ఎదురుదెబ్బలను ఎదుర్కొంటోంది. ఈ ప్రతీకార సుంకాలు అమెరికా ఎగుమతులను దెబ్బతీస్తాయి, ముఖ్యంగా రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం పడుతుంది. అమెరికాకు కెనడా అతిపెద్ద చమురు సరఫరాదారు కాబట్టి, ఇది ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది: చైనా ప్రతీకారం ఇంకా పూర్తిగా స్పష్టంగా లేనప్పటికీ, గతంలో ట్రంప్ మొదటి పర్యాయంలో విధించిన సుంకాలకు ప్రతిగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు (సోయాబీన్స్ వంటివి) మరియు టెక్ ఉత్పత్తులపై సుంకాలు విధించింది. ఇప్పుడు కూడా ఇలాంటి చర్యలు తీసుకోవచ్చు. అమెరికా: ఈ ప్రతీకార చర్యల వల్ల అమెరికా వినియోగదారులకు ధరలు పెరగవచ్చు, సరఫరా గొలుసులు దెబ్బతినవచ్చు, మరియు ఆర్థిక వద్ధి మందగించవచ్చని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల వాణిజ్య యుద్ధం ముదిరే అవకాశం ఉంది.

### శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ సేవ పోలీసుల ప్రధాన విధి

కాకినాడ శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ సేవ పోలీస్ వారి ప్రధాన విధి అని కాకినాడ జిల్లా ఎస్ పి జి. బిందుమాధవ్ ఉద్ఘాటించారు. జిల్లా సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఎస్.పి. జి.బిందుమాధవ్ పాల్గొన్నారు. కాకినాడ జిల్లా సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ కార్యక్రమం ఫిబ్రవరి 15న ప్రారంభమై బుధవారం ఉదయం కాకినాడ జిల్లా పోలీస్ గ్రౌండ్ నందు పరేడ్ తో ముగిసాయి. శాంతి భద్రతల రక్షణ లోను, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచి వేయడములో ఆర్మడ్ రిజర్వు పోలీసుల కృషి, సహకారం ఎంతో ఉందని తెలిపారు. జిల్లా సాయుధ దళాలు ముగింపు పరేడ్ లో మంచి ప్రతిభ ప్రదర్శించారని సిబ్బందిని అభినందించారు. గత రెండు వారాలుగా జరిగిన వార్షిక మొబలైజేషన్ కార్యక్రమంలో సిబ్బంది శారీరిక దృఢత్వం, ఆయుధాలతో డ్రిల్లు, ఫైరింగ్ లోను, మాబ్ ఆపరేషన్ లోను మంచి శిక్షణ పొందారని, మనమంతా శాంతి భద్రతల పరిరక్షణ కు కృషి చేయాలని, అందరూ మంచి ఆరోగ్యముతో ఉండటానికి ప్రతి రోజు వ్యాయామం చేయాలని ఆకాంక్షించారు.

### 45 రోజుల్లో రూ. 30 కోట్ల లాభం

లక్నో మార్చి 6, (న్యూస్ పల్స్) మహాకుంభమేళా చాలా మంది రాతల్ని మార్చేసింది. ఆన్ లైన్ లో వైరల్ అయిన మోనాలిసా భోంస్లే మాత్రమే కాదు.. ఇలా బయటకు తెలియని చాలా మంది సూపర్ స్టార్లు అయ్యారు. కోట్లకు కోట్లు సంపాదించుకున్నారు. అలాంటి వారిలో ఒకరు బోటు యజమని. ఆయన నెరన్నరలో ఏకంగా ముప్పై కోట్ల రూపాయలు సంపాదించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా జరిగిన భారీ ఆర్థిక కార్యకలాపాలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివరించారు. వివిధ రంగాలలో 3 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. పడవ నడిపే కుటుంబం ఎంత సంపాదించిందో యోగి ఆదిత్యనాథ్ వివరించారు. 130 పడవలను నిర్వహిస్తున్న ఒక కుటుంబం 45 రోజుల్లో రూ. 30 కోట్ల లాభం ఆర్జించిందని, ప్రతి పడవ రోజుకు యాభైవేలకుపైగా సంపాదించారని తెలిపారు. 45 రోజుల్ వారు 30 కోట్లు లాభం పొందారు... అంటే ప్రతి పడవ రూ. 23 లక్షలు సంపాదించిందని సీఎం తెలిపారు. మహా కుంభ్‌కు ప్రభుత్వం రూ.7,500 కోట్లు పెట్టుబడి పెట్టింది. పన్నుల రూపంలో అంత కంటే ఎక్కువగా వచ్చాయని సీఎం తెలిపారు. మహా కుంభ్ ద్వారా మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పించామని 14 ఫ్లైఓవర్లు, తొమ్మిది అండర్‌పాస్‌లు ,12 కారిడార్లు నిర్మించామన్నారు. భారత జీడీపీ వృద్ధికి ఇవన్నీ ఉపయోగపడతాయన్నారు. అయితే మహాకుంభ్‌లో జరిగిన ఖర్చు ఎక్కువగా ఆహారం, నిత్యావసరాలు, పడవ ప్రయాణాలు, స్థానిక కొనుగోళ్లు, నమోదుకాని చిన్న వ్యాపారాల ద్వారా జరిగిందని నిపుణులు చెబుతున్నారు. వీటి ద్వారా జీఎస్టీ రాదని అంటున్నారు. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం సంగతి క్కన పెడితే ఆహారం, నిత్యావసరాలు, పడవ ప్రయాణాలు, స్థానిక కొనుగోళ్లు, నమోదుకాని చిన్న వ్యాపారాలను చేసుకుంటున్న వారు మాత్రం పెద్ద ఎత్తున లాభపడ్డారని అర్థం చేసుకోవచ్చు. కొన్ని పడవల ద్వారానే కోటీశ్వరుడు అయ్యారంటే.. మిగిలిన వ్యాపారులు కూడా అదే స్థాయిలో సంపాదించి ఉంటారని.. ఎన్నో వేల మంది జీవితాలను మహాకుంభ్ మార్చేసి ఉంటుందని అంటున్నారు.

### కాళేశ్వరం గోదావరి జలాలు అందించాలని కాలువలో తుంగతుర్తి రైతులు నిరసన

తుంగతుర్తి ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా కాలేశ్వరం గోదావరి జలాలు అందజేసి రైతులను ఆదుకోవాలని తుంగతుర్తి మండల కేంద్రంలోని రైతులు గురువారం కాలువ లో నిరసన వ్యక్తం చేశారు. కేసీఆర్ గారు వున్నప్పుడు బ్రహ్మాండంగా నీరు వచ్చినాయి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది నీళ్ల కరువు వచ్చి చస్తున్నాం. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి.., మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు... మాకు ఆత్మహత్య తప్ప మరో దారి కనిపించడం లేదు, మా రైతులను ఎప్పుడూ కనిపెడుతావో రేవంత్ రెడ్డి నీ దయ అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు

### వెటర్నరీ విద్యార్థుల అందోళన తీవ్రతరం

గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ(వెంకటేశ్వర యూనివర్సిటీ) కళాశాలలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళన తీవ్రతరం అయింది. స్టై ఫండ్ పెంచాలంటూ గత 30 రోజులుగా విద్యార్థులు నిరసన దీక్ష చేస్తున్నారు. తమ సమస్యలు నెరవేర్చక పోగా మమ్మల్ని హాస్టల్ నుంచి బయటికి తోసేసారంటూ ఆందోళనకు దిగారు. కళాశాల గేట్లు మూసివేసి సిబ్బందిని, కళాశాల యాజమాన్యాన్ని లోపలికి అనుమతించలేదు. దాంతో పోలీసులు కళాశాల వద్ద చేరుకున్నారు. సమస్యను పరిశీలించేలా యాజమాన్యం మాట్లాడుతాము సమ్మె విరమించండి అని పోలీసులు సముదాయించినా విద్యార్థులు వినడంలేదు

### పుంగనూరు లో ఫుడ్ కమిషన్ ఛైర్మన్ పర్యటన

పుంగనూరు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి పుంగనూరు లో పర్య టించారు. రహమత్ నగర్ లోని అంగన్వాడి కేంద్రాలు, లినార్డ్ మున్సిపల్ హైస్కూలను, బజారు వీధిలోని చౌక దుకాణాన్ని,ఎం డియు వాహనాలను పరిశీలిం చారు. విద్యార్థుల ఉద్దేశించి మాటా డారు..పిల్లలకు బాల్యం చాలా ముఖ్యమైనది. చదువు చాలా ముఖ్యమని, చదువుకోవడం వలన వారి జీవితం మెరుగుపడుతుందని అందరూ బాగా చదువుకోవాలని తెలిపారు.

### ఏసీబీ వలలో విద్యుత్ ఏడీ

యాదాద్రి చౌటుప్పల్ లో విద్యుత్ ఏడీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఒక రైతు నుంచి 70 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా అధికారి శ్యాం ప్రసాద్ ను పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏసీబీ బృందం సోదాలు కొనసాగించింది.

### దర్గా హటావో.. వేములవాడ బచావో

రాజన్న సిరిసిల్ల వేములవాడ రాజరాజేశ్వర స్వామి హుండీలో విచిత్ర చిట్టీలు లభ్యం అయ్యాయి. దర్గా హఠావో... వేములవాడ బచావ్... అంటూ భక్తులు చీటీలు రాసి హుండీలో వేసారు. హుండీ లెక్కింపు లో చీటీలు బయటపడ్డాయి. వాటిని ఎప్పటికప్పుడు ఆలయసిబ్బంది గమనిస్తూ తీసి వేస్తున్నారు.

# మహిళా ఉద్యోగులకు ఫుల్ డిమాండ్


**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** భారత్ జాబ్ మార్కెట్ గణనీయమైన పురోగతి కనిపిస్తున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే 2025 లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు 48% పెరిగినట్లు ఫౌండిట్ నివేదిక వెల్లడించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), మానుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్ వంటి కీలక పరిశ్రమల్లో ఈ వృద్ధి కనిపిస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా ప్రస్తుతం వస్తున్న కొత్త టెక్నాలజీలో నిష్ణాతులైన వారికి జాబ్ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ కూడా ఉంది. ఇవన్నీ మహిళకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నట్లు ఫౌండైట్ ఎఖ-మార్కెటింగ్ అనుపమ భీమ్రాజ్కు అంటున్నారు. ఆఫీస్ నుంచి చేసే ఉద్యోగాల్లో 55 శాతం పెరుగుదల గమనించాం. ఇది యజమాని ప్రాధాన్యతలలో మార్పును సూచిస్తుంది. జీతం సమానత్వం, అభివృద్ధి చెందుతున్న పని-మోడ్ ప్రాధాన్యతలు వంటి రంగాలలో సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ.. 2025లో మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్యం ప్రోత్సాహకరంగా ఉందని ఆమె అన్నారు. 2025లో మహిళా ఫ్రెషర్స్ కి ఉద్యోగాలు ఇచ్చేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నట్లు ఫౌండిట్ నివేదిక చెబుతుంది. 0 నుంచి 3 ఏళ్ల అనుభవం ఉన్న మహిళలకు 53 శాతం ఉద్యోగ అవకాశాలు, 4 నుంచి 6 యేళ్ల అనుభవం ఉన్నవారికి 32 శాతం ఉద్యోగ అవకాశాలు.. ఇలా అనుభవ స్థాయిలు పెరిగేకొద్దీ ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఇక 7 నుంచి 10 యేళ్ల అనుభవం ఉన్నవారికి 11 శాతం, 11 నుంచి 15 యేళ్ల అనుభవం ఉన్న వారికి 2 శాతం, 15 కంటే ఎక్కువ యేళ్ల అనుభవం ఉన్నవారికి కేవలం 1% మాత్రమే ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా ఫ్రెషర్స్‌కి ఈ ఏడాది బాగా కలిసివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ, హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్, మార్కెటింగ్‌లో మొత్తం ఉద్యోగాల్లో మహిళలకు దాదాపు 25 శాతం డిమాండ్ ఉంది.వైట్-కాలర్ వర్క్‌ఫోర్స్‌లో ఐటీలో అత్యధికంగా 23%, ఆ తర్వాత బీఎఫ్ఎస్ఐలో 11%, విద్యలో 6% మహిళలు యజమానులుగా కొనసాగుతున్నారు. రంగాల వారీగా పోల్చి చూస్తే ఐటీ/కంప్యూటర్లు-సాఫ్ట్‌వేర్ రంగాల్లో మహిళలు యజమానులుగా కొనసాగుతున్నప్పటికీ దీని వాటా ఫిబ్రవరి 2024లో 36% ఉంటే ఫిబ్రవరి 2025లో 34%కి స్వల్పంగా తగ్గింది. ఇక మహిళా నియామకాలు, సిబ్బంది ఉద్యోగాల్లో 24% నుంచి 20%కి, బీఎఫ్ఎస్ఐ 23% నుంచి 21%కి తగ్గాయి. అయితే అడ్వర్‌టైజ్‌మెంట్లు, మార్కెట్ రీసెర్చ్, పబ్లిక్ రిలేషన్స్, ఈవెంట్స్ రంగాల్లో మాత్రం మహిళల భాగస్వామ్యం 8% నుంచి 11%కి పెరిగాయి. అలాగే ఇంజనీరింగ్, ఉత్పత్తి రంగాల్లో కూడా 6% నుంచి 8%కి పెరిగాయి. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలలో మహిళల భాగస్వామ్యం పెరగడం మరొక ముఖ్యమైన ధోరణి. ప్రస్తుతం 26% మంది మహిళలు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి స్పెషల్ టెక్నాలజీ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే దేశంలో ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు (టైర్ 1) వెలుపల మహిళా నిపుణుల సంఖ్య పెరుగుతోంది. నివేదిక ప్రకారం.. 2025లో టైర్ 1 నగరాల్లో మహిళలు ఉద్యోగాలలో 41% ఉంటే.. నాసిక్, సూరత్, కోయంబత్తూర్, జైపూర్ వంటి టైర్ 2, టైర్-3 నగరాల్లో 59% ఉన్నారు. ఇది కంపెనీల నియామక వ్యూహాలలో మార్పును సూచిస్తుంది.

# గూగుల్ హెడ్ గా మహేష్ బాబు హీరోయిన్

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** కొంతమంది హీరోయిన్లు కేవలం కొన్ని సినిమాలకు మాత్రమే పరిమితం అవుతారు. పాపం ఈ అమ్మాయి పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది, ఎక్కడ ఉంది ఏమి చేస్తుంది అని మనం టీవీ లో ఎప్పుడైనా వాళ్లకు సంబంధించిన సినిమా వచ్చినప్పుడు అనుకుంటూ ఉంటాము. కానీ వాళ్ళు స్టార్ హీరోయిన్ కంటే అత్యున్నత హోదాలో ఉన్నారనే విషయం తెలుసుకొని ఆశ్చర్యపోతుంటాము. చాలా మంది హీరోయిన్లు కెరీర్ లో అవకాశాలు తగ్గిన తర్వాత వేరే రంగాన్ని ఎంచుకొని ఉన్నత స్థానాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. ఐపీఎస్, రంగంలోకి అడుగుపెట్టి రాణించిన వారు, అదే విధంగా ఐటీ రంగంలో సాఫ్ట్ ఇంజినీర్లు గా రాణించేవాళ్ళు ఉన్నారు. అలాంటి హీరోయిన్ గురించే ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నాం. ఈమె గతంలో సూపర్ స్టార్ మహేష్ బాబు తో కలిసి ఒక సినిమా చేసింది. బాలీవుడ్ లో అయితే అనేక సినిమాల్లో హీరోయిన్ గా నటించింది.కానీ ఇప్పుడు ఈమె గూగుల్ కి హెడ్ గా వ్యవహరించే స్థాయికి ఎదిగింది. ఆమె పేరు మయూరి కాంగో. ఈమె సూపర్ స్టార్ మహేష్ బాబు మూడవ చిత్రం వంశీ లో ఒక హీరోయిన్ గా చేసింది. ఆ సినిమాలో మెయిన్ హీరోయిన్ నమ్రత శిరోద్కర్ అనే విషయం అందరికీ తెలిసిందే. కానీ ఆ చిత్రంలో ఒక చిన్న క్యారక్టర్ చేసింది. ఈమె 1995 వ సంవత్సరం లో నసీం అనే బాలీవుడ్ చిత్రం ద్వారా వెండితెర అరంగేట్రం చేసింది. ఆ తర్వాత పలు బాలీవుడ్ సినిమాల్లో హీరోయిన్ గా, క్యారక్టర్ ఆర్టిస్టుగా నటిస్తూ వచ్చిన ఈమె 2000 సంవత్సరం లో మహేష్ బాబు హీరోగా నటించిన 'వంశీ' చిత్రం ద్వారా మన టాలీవుడ్ ఆడియన్స్ కి పరిచయమైంది. అప్పటి వరకు ఏడాది కి ఒక్క సినిమా మాత్రమే చేస్తూ వచ్చిన మయూరి, 2000 సంవత్సరం లో మాత్రం 5 సినిమాల్లో నటించింది.ఆ తర్వాత 2003 వ సంవత్సరం లో ఆదిత్య ధిల్లాన్ అనే ప్రముఖ ఔఖీఎ ని పెళ్ళాడి సినిమాలకు దూరమైంది. 2008 వ సంవత్సరం లో మాత్రం 'కాశ్మీర్ హమారా హై' అనే సినిమాలో కనిపించింది కానీ, ఆ తర్వాత సినిమాలకు శాశ్వతంగా దూరమైంది. పెళ్లి తర్వాత న్యూ యార్క్ సిటీ లో మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్ లో ఎంబియే పూర్తి చేసిన మయూరి, ఆ రంగం లో ఎంతో గొప్పగా రాణించింది. ఎన్నో అంతర్జాతీయ సంస్థల్లో సేవలు అందించిన ఈమె, ప్రస్తుతం గూగుల్ లో ఇండియా ఇండస్ట్రీ హెడ్ ఫర్ ఏజెన్సీ బిజినెస్ రోల్ లో పని చేస్తుంది. ఈమె నెల జీతం లక్షల్లో ఉంటుంది. ఒక స్టార్ హీరోయిన్ సంవత్సరం మొత్తం కష్టపడి పని చేసి సంపాదించే డబ్బులను ఈమె కేవలం ఆరు నెలల్లో సంపాదిస్తుంది. దీనిని బట్టి ప్రస్తుతం ఆమె రేంజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

## తులసి దాస్ హనుమాన్ చాలీసాను హిందీ నుండి తెలుగులోకి అనువదించి గేయ రచయిత ఎమ్మెస్ రామారావు

## -నేడు అయన జయంతి




తులసి దాస్ హనుమాన్ చాలీసాను హిందీ నుండి తెలుగులోకి అనువదించి గేయ రచయిత ఎమ్మెస్ రామారావు ఆయన పూర్తిపేరు మోపర్తి సీతారామారావు. ఈయనకు సుందర దాసు అనే బిరుదు ఉంది. ఈయన తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకుడు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తాహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించాడు. గేయ రూపంలో ఈయన రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము ఎమ్మెస్ రామారావు సుందరకాండ గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఈయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.

ఎమ్మెస్ రామారావు 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య మరియు మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో మరియు గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. రామారావు గారికి 1942 లో లక్ష్మీ సామ్రాజ్యంతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె (వెంకట సరోజిని) మరియు ఇద్దరు కుమారులు (బాబూరావు, నాగేశ్వరరావు)

ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించారు. ఆ చిత్రంలో నాయక పాత్ర ధరించిన సి.హెచ్. నారాయణరావుకు ఇది గాత్రదానం. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. తరువాత ఈయన దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది.

1963 సంవత్సరాంతంలో కొన్ని కారణాల వల్ల మద్రాసు వదిలి రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్(ఎంఈ)లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువదించారు మరియు తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయరచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబాదులో సహజ కారణాల వల్ల మరణించాడు.

# ఆగని మూగ జీవాల అక్రమ రవాణా

**- యదేచ్ఛగా కభేళాలలకు తరలింపు.**

**- వరుసగా పట్టుబడుతన్న వైనం**

**.- ఉక్కుపాదం మోపే దిశగా ములుగు జిల్లా పోలిసులు.**



ములుగు : మూగ జీవాల అక్రమ రవాణా మళ్లీ మొదలైయింది. కొంత కాలం పోలీసుల విస్తృత తనిఖీలు, విస్తృత చర్యలతో మౌనం వహించిన మూగ జీవాల అక్రమ రవాణా దారులు అదును చూసి మళ్లీ మూగజీవాల అక్రమ రవాణా షురూ చేసారు. పోలీసులు వీరి అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్న అక్రమార్కులు మాత్రం మూగజీవాల రవాణాకు కొత్త మార్గాలను ఏర్పాటు చేసుకుంటూ పోలీసులకు సవాల్ గా నిలుస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా గడిచిన రెండు నెలల వ్యవదిలో పలుమార్లు మూగజీవాలను అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటనలు కనిపిస్తున్నాయి.

యదేచ్ఛగా కభేళాలకు తరలింపు..

చర్ల నుండి నూగూరు వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట, ములుగు మండలాల మీదుగా హైదరాబాద్ లోని కభేళాలకు రోజు రాత్రి సమయంలో మూగ జీవాల అక్రమ రవాణా యదేచ్ఛగా కొనసాగుతుంది. మూగ జీవాలను రవాణా చేయడానికి అశోక్ లీ ల్యాండ్, బోలేరో, డీసీఏం, కంటైనర్, లారీ వంటి వాహనాలను వాడుతూ అక్రమ రవాణా యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అయితే మూగ జీవాలను అక్రమంగా తరలించే క్రమంలో చూసేవారికి అనుమానం రాకుండా అక్రమ రవాణా దారులు వాహనాలకు ప్రత్యేక మార్పులు చేసి చెక్‌పోస్టుల మీదుగా మూగజీవాలను ధర్జాగా కభేళాలకు తరలిస్తున్నారు.

ఏస్కార్ట్‌గా ప్రైవెట్ వాహనాలు, ప్రైవెటు వ్యక్తులు..బండికి 3వేలు, 5 వేలు..

మూగ జీవాలను అక్రమంగా రవాణా చేసే అక్రమార్కులు రవాణా సమయంలో ఏస్కార్ట్‌గా ప్రైవేట్ వాహనాలను, ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని మూగజీవాల రవాణా కోనసాగిస్తున్నారు. ఇందులో భాగంగాగానే ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అయన అనుచరులు



ఇద్దరు అక్రమ రవాణాను చెక్‌పోస్టులు దాటించండంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. మూగ జీవాలను అక్రమంగా రవాణా చేసే సమయంలో ఈ ముగ్గురు వాహనాలకు కార్లలో ఏస్కార్ట్ గా వ్యవహరిస్తూ చెక్‌పోస్టులు దాటించినందుకు చిన్న వాహనాలకు 3000, పెద్ద వాహనాలకు 5000 వేలు చార్జ్ చేస్తూ మూగ జీవాల రవాణా దారుల నుండి వసూళ్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మారని తీరు..రూటు మార్చి తరలింపు..

మూగజీవాలను నిబంధనలను ఉల్లాంఘిస్తూ అక్రమంగా తరలించే వారి తీరు మారడం లేదు.పోలీసులు పట్టుకుంటున్నారు అనే సమాచారం ఏస్కార్ట్‌ల ద్వారా తెలుసుకుంటున్న అక్రమార్కులు రూటు మార్చి మూగ జీవాలను తరలిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా వీరు ఏంచుకున్న మార్గాలు. రామన్నగూడెం మీదుగా పస్కాపురం, పస్కాపురం మీదుగా గోగుపల్లి, శివాపురం,చిన్నబోయినపల్లి మీదుగా ములుగు జిల్లా కేంద్రాన్ని దాటిస్తున్నారు.

ఉక్కుపాదం మోపే దిశగా పోలిసుల, వరుసగా పట్టుబడుతున్న వైనం..

మూగ జీవాలను అక్రమంగా కభేళాలకు తరలిస్తున్న వారిపై ములుగు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపే దిశగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే గడిచిన రెండు నెలల వ్యవదిలో మూగజీవాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను, వ్యక్తులను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేసారు.

రెండు నెలల్లో పట్టుకున్న వివరాలు...

ఫిబ్రవరి 4 వ తేదిన బోలేరో వాహనంలో నిబంధనలను ఉల్లాంఘిస్తూ మూగజీవాలను అక్రమంగా తరలిస్తుండగా ఏటూరునాగారం పోలిసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.ఫిబ్రవరి 8 వ తేదిన మూగజీవాలను అక్రమంగా లారీలో తరలిస్తుండగా ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ స్వయంగా పట్టుకుని కేసు నమోదు చేశారు.మార్చి 2 వ తేదిన 2 డీసీఏం కంటైనర్‌లలో 65 పశు వులను అక్రమంగా తరలిస్తుండగా ఏటూరునాగారం ఏస్సై తాజుద్దీన్ పట్టుకుని కేసు నమోదు చేశారు.మార్చి3 వ తేదిన బోలేరే వాహనంలో పశువులను అక్రమంగా తరస్తున్న వాహనాన్ని ఏటూరునాగారం ఏస్సై తాజుద్దీన్ పట్టుకుని కేసు నమోదు చేశారు.మార్చి 5 వ తేదీన 4 బొలెరో వాహనాలలో 42 పశువులను వెంకటాపురం సిఐ బండారి కుమార్ పట్టుకుని కేసు నమోదు చేశారు.

# కేంద్ర మంత్రి జైశంకర్ పై దాడికి యత్నం





లండన్ భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి జైశంకర్ పై దాడి యత్నం జరిగింది. లండన్ లో అయన కారు దగ్గరకు వచ్చిన యువకుడు దాడికి ప్రయత్నించాడు. ఇది ఖలిస్థానీ మూకల దుశ్చర్య అని అనుమానిస్తున్నారు. దాడికి దిగిన ఆగంతకుడు భారత జెండాను అవమానించేలా ప్రవర్తించాడు. లండన్ పోలీసులు వెంటనే అప్రమత్తమై వెంటనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా లోపం కారణంగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

అంతకుముందు కేంద్ర మంత్రి పాల్గోన్న కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కొంతమంది చేరుకుని నినాదాలు చేసారు.

## శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం భూమిని ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు కేటాయించండి ...

## స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్...

జమ్మికుంట ( జమ్మికుంట ట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల 647 సర్వే నెంబర్లు గల భూమిని గురుకుల పాఠశాలకు కేటాయించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్,

జమ్మికుంట పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన అమ్మ వెంకటేష్, మాట్లాడుతూ. 1980లో అప్పటి ప్రభుత్వం జమ్మికుంట గ్రామపంచాయతీ పాలకవర్గం విద్యార్థుల భవిష్యత్తు ను గుర్తుపెట్టుకుని రేపటి తరానికి ఒక మంచి విద్యార్థులు ఉండాలని భావించి అప్పటి సర్పంచ్ కృష్ణంరాజు, మరియు పాలకవర్గం శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం పాఠశాల వ్యవస్థాపకులు కీర్తిశేషులు కాంతారావు కు 35 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ తో రెండు ఎకరాల భూమిని కేటాయించడం జరిగింది కానీ దురదృష్టవశాత్తు కాంతారావు, మరణించినాక శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం పాఠశాల మూసివేయడం జరిగింది. ఇది అదునుగా చూస్తూనే గత ప్రభుత్వంలో ముఖ్య భూమిక పోషించినటువంటి మున్సిపాలిటీ నాయకులు ప్రభుత్వం తమది అని భావించి ఖాళీగా ఉన్నటువంటి ఆ భూమిని క్రయవిక్రయాలు చేయడం జరిగిందని విద్యార్థి సంఘాలుగా మేము పలుమార్లు రెవెన్యూ మరియు మున్సిపాలిటీలో దరఖాస్తు పెట్టడం ద్వారా ఆ భూమి దొంగల చేతులకు పోకుండా ఆగిందని మళ్లీ తిరిగి ఇప్పుడు ఆ భూమిని కొనుగోలు అమ్మకాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఇట్టి భూమిని జిల్లాకలెక్టర్ ఎంక్వయిరీ నిమిత్తం సంబంధిత అధికారులను కేటాయించి అ భూమిని కాపాడి ఆ స్థలంలో గురుకుల పాఠశాల కానీ వసతి గృహాలకు గాని కేటాయించాలని వారు కోరారు..

## సింగిరెడ్డిపల్లి లో ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య



కమాన్ పూర్ఆర్జీ-2 ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోని రేమేడియేషన్ మేషర్స్ క్రింద వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంలో బాగంగా వకిల్ పల్లి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామమైన సింగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు తేది:-07 శుక్రవారం రోజున ఉ. 9 గం.ల నుండి సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

ఈ ఉచిత వైద్య శిభిరంలో నిష్ణాతులైన సింగరేణి వైద్యులచే అన్నీ రకాల వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని డిజిఎం పర్సనల్ ఒ అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్ తెలిపారు.

కావున సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు ఎక్కువ మంది హాజరై ఆర్జీ-2 ఏరియా సింగరేణి సంస్థ కల్పిస్తున్న ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

## వ్యూహాల్లో కిషన్...

## మండలి ఎన్నికల్లో స్వీప్...



**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** ఎవరైనా గట్టిగా కొడతారు.. లేకపోతే గురి చూసి కొడతారు.. ఈయనేంట్రా పద్దతిగా అంటు కట్టినట్లుగా కొట్టాడు" అని ఓ సినిమాలో డైలాగ్ ఉంటుంది. ఇది ప్రస్తుత తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సరిగ్గా సరిపోతుంది. తెలంగాణలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు బీజేపీ గెల్చుకుంది. అభ్యర్థుల ఎంపిక నుంచి.. పోలింగ్ లో ఓట్లు వేయించుకునే వ్యూహం వరకూ తనదైన వ్యూహాలతో నడిపించిన కిషన్ రెడ్డి సైలెంట్ గా కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బకొట్టారు. అధికారంలో ఉన్న పార్టీ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీని గెలుచుకోవడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఉత్తర తెలంగాణలోని నాలుగు జిల్లాల్లో బీజేపీని బలోపేతం చేయడమే కాదు... సానుభూతి పరుల్ని ఓటర్లుగా మార్చే వ్యూహంలో కిషన్ రెడ్డి తనదైన నాయకత్వాన్ని చూపించారు.

తెలంగాణలో బీజేపీకి ప్రజల మద్దతు పూర్తి స్థాయిలో లభిస్తోందని దాన్ని ఓట్లుగా మార్చుకునే మెకానిజాన్ని కిషన్ రెడ్డి ఓ ప్లాన్ ప్రకారం ఏర్పాటు చేసుకుంటూ పోయారు. ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తాయని తెలిసిన వెంటనే.. కార్యాచరణ ప్రారంభించారు. పట్టభద్రుల నియోజకవర్గం నాలుగు ఉత్తర తెలంగాణ ఉమ్మడి జిల్లాల్లో ఉంటుంది. అంటే టీచర్స్ నియోజవర్గాలు రెండింటిని కలుపుకుంటే 13 జిల్లా, 42 అసెంబ్లీ స్థానాలు, 270 మండలాలు, ఆరు లోక్ సభ నియోజకవర్గాల పరిధిలో ఈ ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా ప్రతి గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్‌ను చేరేలా పకడ్బందీ ప్రచార ప్రణాళికను .. ప్రతి ఒక్క ఓటర్‌ను మూడు, నాలుగు సార్లు కలిసేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి కిషన్ రెడ్డి ప్రచారం చేశారు. ఈ వ్యూహాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకోలేకపోయింది.. చేధించలేకపోయిందని.. ఫలితాలను బట్టి అర్థమవుతోంది. టీచర్స్ నియోజకవర్గంలో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కొమురయ్య గెలిచారు. పట్టబద్రుల నియోజకవర్గంలో అత్యంత హోరాహోరీగా జరిగినా ఓట్లు చీల్చే వ్యూహాలను కాంగ్రెస్ పార్టీ పాటించినా బీజేపీ విజయాన్ని ఆపలేకపోయారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరోసారి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డికి .. ఆ ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో సమయం సరిపోలేదు. ఓ వైపు కేంద్ర మంత్రిగా ఈశాన్య రాష్ట్రాల గురించి పట్టించుకుంటూనే తెలంగాణలో ఎన్నికలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినప్పటికీ.. పార్టీ ఒక్క అసెంబ్లీ స్థానం నుంచి ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు చేరింది. ఓటు బ్యాంక్ 14 శాతానికి చేరింది. అంతకు ముందు ఈ ఓటు బ్యాంక్ ఆరు శాతం వరకే ఉండేది. ఈ ఉత్సాహంతో కిషన్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై గురి పెట్టారు. ఐదు నెలల్లోనే పార్టీని ఆయన బలోపేతం చేశారు. మోదీ చరిష్మాను ఉపయోగించుకుని .. లోక్ సభ ఎన్నికల్లో గరిష్టంగా సీట్లు తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు. ఎనిమిది పార్లమెంట్ సీట్లలో బీజేపీ తిరుగులేని విజయం సాధించింది. రెండు, మూడు చోట్ల మినహా అన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ 35 శాతానికి పెరిగింది. అంటే అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఉంది. లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన మెజార్టీలు చూస్తే.. 40 స్థానాల్లో బీజేపీ ఆధిక్యం లభించింది. ఆ తర్వాత ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. భారతీయ జనతా పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగిన నేత కిషన్ రెడ్డి. ఆయనకు పార్టీ భావజాలంపై, విధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటుంది. ఏ మాత్రం పార్టీ లైన్ దాటరు. ఇప్పటి వరకూ ఆయన వివాదాస్పదంగా చేసిన ఒక్క ప్రకటన ఉండదు. అలాగని పార్టీ విధానాలను బలంగా చెప్పలేదన్న అభిప్రాయం కూడా ఉండదు. బీజేపీ ఐడియాలజీని ఎంత బలంగా చెబుతారంటే..ఆయన మాటల్ని ఎవరూ వివాదాస్పదం చేయలేరు. అలాంటి రాజకీయంతోనే బీజేపీని బలోపేతం చేస్తూ వస్తున్నారు. ఇతర నేతలపై పరుషంగా మాట్లాడితేనో.. తిట్లందుకుంటేనో వార్తల్లో ఉంటామని.. దాని వల్ల పార్టీకి నష్టం జరుగుతుంది. అందుకే ఎప్పుడు అలాంటి రాజకీయం చేయరు. కానీ రాజకీయంగా ఎప్పుడూ పార్టీ విధానాలు, భావజాలం విషయంలో రాజీపడరు. తెలంగాణ బీజేపీకి అలాంటి పునాదులు వేసిన కిషన్ రెడ్డి .. ఇప్పుడు విజయాల పరంపరంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంలో కిషన్ రెడ్డి స్టైల్ ను జాతీయ నాయకత్వాన్ని కూడా ఆకర్షించింది. అందుకే పార్టీ పరంగా అయినా పాలన పరంగా అయినా కీలకమైన బాధ్యతల్ని అప్పగిస్తూ వస్తున్నారు. మొదటగా కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ చేశారు కానీ కొద్ది కాలానికే ఆయనకు కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ లభించింది. ఐదుగురు సహాయ మంత్రులు కిషన్ రెడ్డి శాఖలను చూసేందుకు ఉండేవారు. వెంటనే మరోసారి మోదీ కేబినెట్ లో చోటు దక్కించుకున్నారు. కిషన్ రెడ్డి పనితీరుపై నమ్మకంతోనే కేంద్రమంత్రిగా ఉంటూనే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కూడా కొనసాగించారు. మామూలుగా అయితే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పార్టీ పరమైన బాధ్యతల నుంచి విముక్తి చేస్తారు. రెండింటికి న్యాయం చేయలేరని అనుకుంటారు. కానీ కిషన్ రెడ్డి పనితీరుపై కేంద్ర పెద్దలకు ఉన్న నమ్మకం వల్ల ఆయనను కొనసాగించారు. గతంలో అమిత్ షా మాత్రమే జాతీయ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా కొనసాగారు. ప్రధాని మోదీతో కలిసి కింది స్థాయి నుంచి కలిసి పని చేశారు కిషన్ రెడ్డి. ఆయన నిజాయితీ, కష్టపడే తర్వాత మోదీకి బాగా తెలుసు. జాతీయ నాయకత్వం మద్దతుతో కిషన్ రెడ్డి తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తున్నారు. కిషన్ రెడ్డి దశాబ్దాల రాజకీయంలో అధికారంలో పదవులు చేపట్టింది చాలా తక్కువ. పార్టీ కార్యకర్త, పార్టీ నేతగానే ఎక్కువగా పని చేస్తూ వచ్చారు. తెలంగాణలో పార్టీ బలోపేతం వెనుక కిషన్ రెడ్డి వేసిన పునాదులే కీలకం. ఇప్పుడు ఆయనే తెలంగాణలో బీజేపీని అజేయశక్తిగా మారుస్తున్నారు. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. బీజేపీదే విజయం అన్నంతగా తెచ్చారు. ఇప్పుడు బీజేపీ ఎదురుచూస్తోంది.. పోరాడుతోంది.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసమే. ఈ విజయం వెనుక కిషన్ రెడ్డి ముద్ర చాలా బలంగా కనిపిస్తుంది. అందులో సందేహం ఉండదు.

మొదటి నుంచి కనిపించిన పోటీ

భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించింది. ఉత్తర తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో అంజిరెడ్డి విజయం ఖరారైంది. అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 73,644 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 63,404 ఓట్లు పడ్డాయి. అంజిరెడ్డి విజయం ఖరారు కావడంతో కౌంటింగ్ హాలు నుంచి నరేందర్ రెడ్డి వెళ్లిపోయారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి చివరి వరకూ గట్టిగా పోరాడారు. కౌంటింగ్ ఉత్కంఠగా సాగింది. మొదట్లో అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు వచ్చాయి. తర్వాత మళ్లీ అంజిరెడ్డి ముందుకు వచ్చారు.బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కూడా బలమైన పోటీ ఇచ్చారు. నామినేషన్లు పూర్తయ్యే నాటికి కాంగ్రెస్, బీజేపీ క్యాండిడేట్ల మధ్యే పోటీ ఉంటుందని అనుకున్నా.. ప్రసన్న హరికృష్ణ అనూహ్యంగా మిగతా ఇద్దరు క్యాండిడేట్లకు ప్రధాన ప్రత్యర్థిగా మారారు. రాష్ట్రంలో బీసీ నినాదం బలపడుతుండడం, చివరి రెండు రోజుల్లో బీఆర్ఎస్ లీడర్లు హరికృష్ణ కోసం పని చేయడంతో రేసులోకి వచ్చారు. నిజానికి ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నించినా అవకాశం రాలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్ తరపున పోటీ చేయాలని కూడా ప్లాన్ చేశారు. అది కూడా వర్కౌట్ కాలేదు. దీంతో బీఎస్పీ తరఫున బరిలోకి దిగారు. కాంపిటీటివ్ బుక్స్ రచయితగా పేరున్న వ్యక్తి కావడంతో.. గ్రాడ్యుయేట్లకు అందులోనూ ప్రధానంగా నిరుద్యోగులకు ఆయన బాగా కనెక్ట్ అయ్యారు. చివరి నిమిషంలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతు కూడా కలిసొచ్చినట్లయింది. కానీ ఆయన మూడో స్థానానికే పరిమితమయ్యారు. విజయం సాధించిన బీజేపీ విస్తృతంగా ప్రచారం చేసింది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ముగ్గురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు చేసిన ప్రచారం చేశారు. ఉత్తర తెలంగాణలో పెరిగిన బలం, నిరుద్యోగులు, ఉద్యోగుల్లో బీజేపీ పట్ల సానుకూల ధోరణి ఆ పార్టీ అభ్యర్థి

## కమలం అంటే పువ్వు కాదు... వైల్డ్ ఫైరేనా

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు చేదు అనుభవం



**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా విషయాలను చెబుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు స్పష్టమైన సిగ్నల్స్ అన్ని పార్టీలకు పంపించారు. ఇక్కడ మూడు స్థానాలకు ఎన్నికలు జరిగితే రెండింటిని బీజేపీ గెలుచుకుంది. ఇది అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి డేంజర్ బెల్స్ లాంటి ఫలితాలు. అందుకే కాంగ్రెస్ పార్టీ ముఖ్యంగా రేవంత్ రెడ్డి మేల్కోవాల్సిన టైం వచ్చిందని అంటున్నారు విశ్లేషకులు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు ప్రధానమైన గ్యారంటీలు ప్రజలకు ఇచ్చింది. వాటిని అమలు చేయడంలో తడబడుతోంది. అదే ఇప్పుడు వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. మహిళలకు ఉచిత బస్ హామీ ఒక్కటి తప్ప వేరే పథకాలు ఏవీ కూడా ప్రజలకు సరిగా అందడం లేదన్నది వినిపిస్తున్న మాట. అందుకే తాము ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. వాటిని రూఢీ చేశాయని ఎమ్మెల్సీ ఎన్నికలు అనేది వారి అభిప్రాయం. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడానికి ఆపసోపాలు పడుతోంది. వచ్చిన రోజే మహిళలకు ఫ్రీ బస్ పథకాన్ని అమలు చేసింది. తర్వాత ఆరోగ్య శ్రీలో రోగాల సంఖ్యతోపాటు అందులో కవర్ అయ్యే సొమ్మును కూడా పెంచింది. అక్కడికి ఏడాది తర్వాత రైతు రుణమాఫీ అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మిగతా పథకాలు అమలుపరిచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. భారీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఖాళీ ఖజానా చూసి నివ్వెరపోయిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆర్థిక స్థితిగతులు తెలియకుండా హామీలు ఇవ్వడం ఏంటనే విమర్శ కూడా ఉండనే ఉంది. అందుకే ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తికరంగా లేరని అంటున్నారు. అదే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌లో స్పష్టమైంది. ప్రజల్లో ఉన్న కాస్త అసంతృప్తిని మరింతగా మండేలా ప్రతిపక్షాల ప్రచారం చేసిందని చెప్పాలి. ఓవైపు బీఆర్ఎస్, మరోవైపు బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ డీఎన్ఏలో ఉన్న కుమ్ములాటలు ఇక్కడ కూడా సర్వసాధారణైపోయాయి. బయటకు అందరూ ఒక్కటిగా ఉన్నట్టే కనిపిస్తున్నప్పటికీ లుకలుకలు మాత్రం లోచెదలా పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నాయన్నది నిజం. ఎన్నికల తర్వాత పార్టీ బలోపేతానికి కానీ, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పి కొట్టే ప్రతి వ్యూహం కాంగ్రెస్‌కు లేకుండా పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆ పార్టీకి ముగ్గురు ఇన్‌ఛార్జ్‌లు మారారు. కానీ పార్టీలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. ప్రత్యర్థులు దూసుకొస్తుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం తమపై తాము కత్తులు దూసుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవడానికి ఇది కూడా ఓ కారణం. అన్నింటి కంటే ముఖ్యం మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసింది ఏదో తాయిలాలకు ఆశపడి వాళ్లు కాదు. అక్షరాస్యులు. అందరి కంటే ప్రభుత్వంపై వీరు పెట్టుకున్న ఆశలే ఎక్కువ. నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్ వంటి హామీలు పట్టభద్రులకు ఇచ్చింది కాంగ్రెస్, ఉపాధ్యాయులకు కూడా చాలా హామీలు ఇచ్చింది. ఏ హామీని కూడా నిలబెట్టుకోలేకపోయింది. ఇలాంటి చేదు ఫలితాలకు ఇవి కూడా మరో కారణం. అందుకే వీరు పంపించిన సిగ్నల్స్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మేల్కొలుపు అంటూ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ సర్కారు ఉన్నప్పుడు పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో వైసీపీ అభ్యర్థి ఓడిపోయారు. ఆ స్థానంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. దీనిపై అప్పటి అధికార పార్టీ నేతలు మాట్లాడుతూ.... వాళ్లు తమ ఓటర్లు కారని అందుకే ఓడిపోయామన్నారు. తమ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వాళ్లు మాత్రమే వేరే ఉన్నారని వాళ్లే వచ్చే ఎన్నికల్లో తమకు ఓట్లు వేస్తారని భ్రమ పడ్డారు. కానీ డిగ్రీ చేసిన వాళ్లు మరికొందర్ని ఇన్‌ఫ్లూయెన్స్ చేస్తారని, వారి ఫ్యామిలీ మెంబర్స్ కూడా పథకాలు అందుకున్న వాళ్లే అన్న సంగతి మర్చిపోయారు. ఇదే వారి ఓటమికి మొదటి అడుగు వేసేలా చేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్ రెడ్డి ఏం చెబితే అది జరిగింది. మొత్తం తానే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. ఇప్పుడు ఈ ఓటమి ఆయన అధికారాలకు కత్తెర వేసే ఛాన్స్ లేకపోలేదనే వాదన ఉంది. ఆయనకు బయట శత్రువులు కంటే లోపల అంటే పార్టీలో ఉన్న ప్రత్యర్థులే ఎక్కువగా ఉన్నారు. అది ఆయన కేరీర్‌ను ప్రమాదంలోకి నెట్టేస్తుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రేవంత్‌పై అధిష్ఠానానికి నమ్మకాలు సన్నగిల్లుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. అపాయింట్‌మెంట్‌లు కూడా దొరకడం లేదనే మాటలు కూడా వినిపించాయి. తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను విశ్లేషించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పులు జరగడం సహజమని వాటిని తెలుసుకొని సరి చేసుకొని ముందడుగు వేయడమే అసలైన నాయకత్వ పటిమకు నిదర్శనమని అంటున్నారు. ఓవైపు కాంగ్రెస్‌పై ప్రజల్లో అసంతృప్తి పెరగడమే కాకుండా బీజేపీ పట్ల ఆదరణ పెరుగుతోందనే భావన బలపడటం ప్రభుత్వానికి మంచిది కాదని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. బీజేపీని లైట్ తీసుకుంటే అసలకే ఎసరు వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## గులాబీ నుంచి ఎవరు

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** తెలంగాణ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ షురూ అయింది. మార్చి 29 నాటికి మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. వీరిలో మహమూద్ అలీ,ఎగ్గె మల్లేశం, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, మిర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ స్థానాలను భర్తీ చేసేందుకు మార్చి 20వ తేదీన పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ రావటంతో... అధికార పార్టీనే కాదు ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా సిద్ధమవుతోంది.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. సంఖ్యా బలం పరంగా చూస్తే... వారికే మెజార్టీ సీట్లు దక్కనున్నాయి. ఇక ప్రతిపక్ష స్థానంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు దక్కే అవకాశం ఉంది. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా? ఒక్క స్థానానికి 28 మంది సభ్యులను ప్రతిపాదికన తీసుకునే అవకాశం ఉంది. అయితే ఓటింగ్ లో పాల్గొనే వారి సంఖ్యను బటి ఇది మారవచ్చు. అయితే సంఖ్యా బలం ప్రకారం చూస్తే బీఆర్ఎస్ తరపున 38 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అయితే వీరిలో 10 మంది పార్టీ మారారు. ప్రస్తుతం వీరి బలం 28గా ఉంది. వీరి సంఖ్య ప్రకారం.. వీరి ఖాతాలోకి ఒక ఎమ్మెల్సీ సీటు వచ్చే అవకాశం ఉంది. మరో సీటు కోసం అభ్యర్థిని నిలబెడుతుందా..? లేదా అనేది పార్టీ నిర్ణయించే అవకాశం ఉంది. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది.బీఆర్ఎస్ ఖాతాలోకి తప్పకుండా ఒక్క ఎమ్మెల్సీ సీటు రానుంది. అయితే ఈ సీటు కోసం పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సామాజిక సమీకరణాలతో పాటు సీనియార్టీ, విధేయత వంటి అంశాలను తెరపైకి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం రిటైర్ అవుతున్న మహ్మముద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి మరోసారి ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవలనే సత్యవతి రాథోడ్ ను విప్ గా నియమించారు. అయితే మరోసారి తనకు అవకాశం పక్కా అని ధీమా వ్యక్తం చేస్తున్నారు.వీరే కాకుండా బీఎస్పీ నుంచి చేరిన ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటంతో పాటు ప్రభుత్వం పోరాడుతున్నారు. ఇక గత ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ పేరును ఖరారు చేసినప్పటికీ.. నాటి గవర్నర్ ఆమోదముద్ర వేయలేదు. దీంతో దాసోజు శ్రవణ్ కు తీవ్ర నిరాశ మిగిలింది.న్యాయ పోరాటం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ అధినేతను కోరుతున్నారంట..!ఇక మరికొంత మంది నేతలు కూడా ఎమ్మెల్సీ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో పార్టీ అధినేత కేసీఆర్ ఆలోచన ఏ విధంగా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఇదే నెలలో పోలింగ్ ప్రక్రియ ఉండటంతో?. త్వరలోనే పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## కాంగ్రెస్ లో చిచ్చు పెట్టేసిన మల్లన్న

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతల ఆరోపణలు క్రమంగా పెరుగుతున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ అయిన తీన్మార్ మల్లన్న ప్రెస్ మీట్ పెట్టి సంచలన ఆరోపణలు చేశారు. తనను కాంగ్రెస్ నుంచి పంపించడం ద్వారా బీసీ ఉద్యమం ఆగిపోతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారని అన్నారు. ఇప్పుడు వచ్చిన బీసీ ఉద్యమం మామూలుది కాదని స్పష్టం చేశారు. కులగణన తప్పుల తడక అని తాను నిరూపిస్తానన్నారు. సర్వే విష యం లో ముఖ్యమంత్రికే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అగ్రకులాలను ఎక్కువ చేసి చూపించారని ఆరోపించారు. సీఎం కుర్చీకి పునాది వేసింది తానేనన్నారు. మహబూబ్ నగర్‌లో వంశీచంద్ రెడ్డి ఓటమికి రేవంత్ కారణమని కూడా ఆరోపించారు. మల్లన్న ఆరోపణలపై మరో సీనియర్ నేత మధుయాష్కీ స్పందించారు. రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న సన్నిహితుడన్నారు. ఆయన ఆరోపణలపై రేవంత్, పీసీసీ చీఫ్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్లు, అగ్రకులాల వాళ్లు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన పనులు చేసినా చర్యలు తీసుకోరని.. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డే క్రమశిక్షణ తప్పాడన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే మేఘా రెడ్డిపై బహిరంగంగా ఆరోపణలు చేశాడు.. మరి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిపై క్రమశిక్షణ చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. కులగణన మీద బీసీ నాయకులతో రేవంత్ రెడ్డి మీటింగ్ పెడితే దానికి జానారెడ్డిని, కేశవరావును పిలిచారు కానీ బీసీ నాయకుడినైనా తనను మాత్రం పిలవలేదన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ చేసిన వ్యాఖ్యలను వంశీచంద్ రెడ్డి ఖండించారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇవ్వడం వల్లనే తాను ఓడిపో?యనన్నారు. తీన్మార్ మల్లన్న తనపై చేసిన ఆరోపణలను జానారెడ్డి ఖండించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని.. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదన్నారు. తనను ఎవరు తిట్టినా పట్టించుకోనని.. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరమన్నారు. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం ఆడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు.

# మీనాక్షి మార్క్...



హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి మార్చి 6, మీనాక్షి నటరాజన్ వచ్చిన తర్వాత తెలంగాణ కాంగ్రెస్ లో వేగంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పదవుల కోసం పోటీ పడుతున్న వారికి ట్విస్ట్ ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నియమితులయిన తర్వాత వరసగా జిల్లాల వారీగా సమీక్షలు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో పదవుల కోసం ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఎమ్మెల్సీ పదవులు కావచ్చు. రాబోయే కాలంలో ఖాళీ కానున్న పదవుల విషయంలో ఆమె కీలక నిర్ణయం తీసుకున్నారు... ఇందుకోసం కాంగ్రెస్ లో ఉన్న నేతలను మూడు గ్రూపులుగా విభజించారు. 1. కాంగ్రెస్ లో చేరిన వారిని ఒక గ్రూపు. 2. ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారు ఒక గ్రూపు. 3. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలో జాయిన్ అయిన వారిని మరొక గ్రూపు. ఇలా మూడు గ్రూపులుగా విభజించి పార్టీ ఐడియాలజీని గౌరవించి వారిని అమలు చేసే వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని మీనాక్షి నటరాజన్ నిర్ణయించినట్లు సమాచారం. ఈ మూడు గ్రూపులుగా ఏర్పాటు చేయడానికి అవసరమైన బాధ్యతను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఉంచినట్లు తెలిసింది.. కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండటంతో పాటు పార్టీ లైన్ ను ధిక్కరించడమే కాకుండా ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత వచ్చిన నేతలు పైరవీలు చేసుకుని పదవులు పొందేందుకు పెద్దయెత్తున లాబీయింగ్ చేస్తుండటంతో మీనాక్షి నటరాజన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పార్టీకి దీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న నేతలకు ఇక మంచి రోజులు వచ్చినట్లే. అదే సమయంలో అప్పటికప్పుడు వచ్చి పదవులు పొందాలని ప్రయత్నించే వారికి కూడా ఒక రకంగా మీనాక్షి నటరాజన్ షాకిచ్చినట్లే అనుకోవాలి. మొత్తం మీద తెలంగాణ కాంగ్రెస్ లో సమూల మార్పులకు మీనాక్షి నటరాజన్ శ్రీకారం చుట్టబోతున్నట్లే అనిపిస్తోంది. ఈ నిర్ణయం జంపింగ్ జంపాంగ్ లకు షాక్ తగిలినట్లే. పార్టీ పరంగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి కూడా ఆమె బాస్. నటరాజన్ పనితీరుపై ఎంత చెప్పుకున్నా తక్కువే. గతంలో తెలంగాణ ఏఐసిసి ఇన్ ఛార్జ్ ల ఎంట్రీ ఓ రేంజిలో ఉండేది.. ఢిల్లీ నుండి హైదరాబాద్ కు దాదాపు అందరూ ఎక్కితే ఫ్లైట్ ..దిగితే ఫ్లైట్.. కండువాలు క్యూ.. వందల్లో బొకేలు..,కాళ్లు మొక్కడం,బ్యాగులు మోయడం..ఇలా ఒకటేమిటి , ఏఐసిసి ఇన్చార్జ్ ప్రసన్నం కోసం కాంగ్రెస్ నేతల పాట్లు అన్నీ ఇన్నీ కావు.. కానీ మీనాక్షి నటరాజన్ మాత్రం వీటికి ఆమడ దూరం ఉంది. పొడద్తులు పడవు, బహుమతులు గిట్టవు. ఒక్కమాటలో చెప్పాలంటే అంచనాలకు అందని గొప్ప వ్యక్తిత్వమున్న అరుదైన రాజకీయ నాయకురాలు.బాధ్యతలు తీసుకున్న రోజే భుజానికి ఓ క్లాత్ బ్యాగ్ తగిలించుకుని , ట్రైన్ లో సాధారణ ప్రయాణికురాలిగా హైదరాబాద్ కు రైల్వే స్టేషన్ లో దిగిపోయారు మీనాక్షి.టిపిసిసి అధ్యక్షుడు సైతం ఆమె ఎంట్రీ చూసి అవ్వాక్కైయ్యారు. అంతేకాదు నా బ్యాగ్ ఎవరూ మోయొద్దు, మీ ఆత్మగౌరవం తగ్గించుకోవద్దు అన్న ఏకైక కాంగ్రెస్ నాయకురాలు .ఈ తరం రాజకీయాల్లో100కు 100శాతం స్వచ్ఛమైన మచ్చలేని నేత మీనాక్షి నాటరాజన్. చూడ్డానికి ఇంత సింపుల్ గా కనిపిస్తున్న..నటరాజన్ పొలిటికల్ ట్రాక్ రికార్డ్ చూస్తే మతిపోవాల్సిందే..మధ్య ప్రదేశ్ ఉజ్జయినీలోని బిర్లా గ్రామ్ నడ్డాలో పుట్టిన నటరాజన్.. ఔజఎ కార్యకర్తగా కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇచ్చి, ఔజఎ అధ్యక్షురాలు, మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస అధ్యక్షురాలు, బిజెపి బాహుబలి లక్ష్మీనారాయణ పాండేను ఓడించిన ఎంపీగా రికార్ట్.. ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించడం వరకూ నటరాజ్ అంటే పనితోనే , పని మాత్రమే మాట్లడుతుంది.తెలంగాణలో పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, ఇటీవల కాంగ్రెస్ లో గ్రూప్ రాజకీయాలు, బహిరంగ విమర్శలు, పార్టీ పరువు తీసేలా హద్దులు దాటుతున్న నేతల తీరు ఎక్కువైయ్యింది. ఆదిలోనే గమనించి , ఇలా వ్యూహాత్మకంగా నటరాజన్ ను రంగంలోకి దించారు రాహుల్ గాంధీ. అధికారం చేయి దాటకుండా నటరాజన్ అనే బ్రహ్మాస్త్రాన్ని తెలంగాణకు పంపారు. ఆమెకు ఏంపీలు, మంత్రులు ఇలా ఎవరైనా డోంట్ కేర్ ,పార్టీ లైన్ దాటితే నిర్దాక్ష్యణ్యంగా గెంటేస్తామంటున్నారట. బాధ్యతలు తీసుకున్న వెంటనే తీన్ మార్ మల్లన్నపై సస్పెషన్ వేటు. తాజాగా మెదక్ పార్లమెంట్ సమావేశంలో నేతలకు వార్నింగ్. పార్టీలో ఎవరిని విమర్శించాలన్నా అది సమావేశాల్లోనే చెప్పాలని.గొడవలు గాంధీ భవన్ గేటు దాటకూడదని. సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడితే, ఎంపీ అయిన, మంత్రులైనా ఇక ఇంటికే సాగనంపుతానంటూ కరాఖండీగా చెప్పేశారు,తెలంగాణ కాంగ్రెస్ నేతలకు చెమటలు పట్టిస్తున్న మీనాక్షి నటరాజన్ఇలా నా బ్యాగ్ లు మోసి, నన్ను కాకాపట్టొద్దు అన్న మాటల నుంచి కాకలు తీరిన నేతలను సైతం పార్టీ లైన్ లో పెట్టడం వరకూ ఆమె పనితీరు వేరే లెవల్ అని వినిపిస్తోంది. సొంత పార్టీ నేతలకు చెమటలు పట్టిస్తున్న మీనాక్షి నటరాజన్ స్పీడు చూసిన ప్రతిపక్షనేతలు సైతం వారెవ్వా ఏం లీడర్ భయ్యా అంటున్నారట.

# క్యూ ఆర్ కొడ్ తో నీలం కార్డులు

హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి మార్చి 6,తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీపై అప్డేట్ ఇచ్చింది. ఉగాది నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కొత్త రేషన్ కార్డు నమూనాను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఖరారు చేశారు. లేత నీలి రంగులో కొత్త రేషన్ కార్డును తయారుచేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రేషన్ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉండే విధంగా రేషన్ కార్డు నమూనాను ఖరారు చేశారు. రేషన్ కార్డుపై క్యూఆర్ కోడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.ఇప్పటికే రేషన్ కార్డులు పొందిన వారికి కూడా కొత్త కార్డులు అందించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ కొత్త నమూనా రేషన్ కార్డులు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. దీంతో ప్రజలు మీ సేవా కేంద్రాలకు క్యూకట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో...కొత్త రేషన్ కార్డులు పొందేందుకు భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారుఈ ఏడాది మార్చి 30న ఉగాది పండుగ నిర్వహించుకోనున్నాం. ఆ రోజున కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణి, గ్రామసభలు, మీసేవ కేంద్రాల ద్వారా కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటి వరకు 13 లక్షల వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, అడ్రస్ మార్పునకు సుమారు 24 లక్షల దరఖాస్తులు వచ్చినట్టుగా అధికారులు వెల్లడించారు. అయితే చాలామంది పాత కార్డులో పేర్లు తొలగించకుండా కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో కొత్త కార్డుల మంజూరు సమస్యగా మారిందని పౌరసరఫరాల శాఖ కీలక సూచనలు చేసింది.కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా వారి పాత రేషన్ కార్డులో పేరు తొలగించుకోవాలని సూచించారు. ఆ తర్వాతే మీసేవ కేంద్రంలో కొత్త వాటికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక ఆధార్ నంబర్ కు అనుసంధానమైన మరో కార్డుకు దరఖాస్తు చేసే అవకాశం లేదని అధికారులు తెలిపారు. కొత్త వివాహమైన మహిళలు తమ పుట్టింటి రేషన్ కార్డులో ఉన్న పేర్లు తొలగించుకుని అత్తింటి వద్ద నూతన కార్డు కోసం దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్తగా పెళ్లైన మహిళలు తమ పుట్టింటి రేషన్ కార్డులో పేరును తొలగించుకునేందుకు తహసీల్దార్‌కు ఒక లెటర్ రాస్తే సరిపోతుందని అధికారులు తెలిపారు. అత్తింటిలో కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకునేవారు వివాహ ధ్రువీకరణ పత్రం లేదా పెళ్లి పత్రికను జత చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తైన ఒకటి, రెండు రోజుల్లో పాత కార్డులో పేరు తొలగిస్తారు. అనంతరం కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.

# మహిళలకు బస్సులు

నల్గోండప్రజాబలం ప్రతినిధిమార్చి 6, మహిళా దినోత్సవం సందర్భంగా రేవంత్ సర్కార్ మహిళలకు శుభవార్త చెప్పింది. ఉపాధి కల్పనలో భాగంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.మొదటి విడతలో 150 మండల సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వనుంది. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె రూపంలో రూ.77,220 చెల్లించనుంది ఆర్టీసీ.బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వనుంది ప్రభుత్వం. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు నడవనుండటం దేశంలోనే తొలిసారి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్.మహిళా స్వయం సహాయక బృందాలతో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయి. మొదటి విడతలో 50 అద్దె బస్సులకు సీఎం చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించనున్నారు.మొదటి దశలో ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో(మహబూబ్ నగర్, కరీంనగర్) మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కేటాయిస్తారు. మొదటి దశలో మహిళా సంఘాల ద్వారా 150 బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. వాటి నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.ఆర్టీసీ బస్సుల కొనుగోలు ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు మొదలైన అంశాలపై అధికారులు సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుల సంఖ్యను పెంచాలనే డిమాండ్ ఉంది.

# 10 రోజుల్లో ఎల్ఆర్ఎస్ పరిష్కారం

హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి మార్చి 6 అనుమతిలేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) కోసం ఎదురుచూస్తున్న వారికి హెచ్ఎండీఏ గుడ్‌న్యూస్ చెప్పింది. దరఖాస్తులను పరిష్కరించేందుకు వేగంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. రుసుము చెల్లించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కేవలం 10 రోజుల్లోనే పరిష్కరిస్తామని చెప్పింది.క్రమబద్ధీకరణ ఫీజు, ప్రో రేటా ఓపెన్ స్పేస్ రుసుమును మార్చి 31గా చెల్లించిన వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. డిస్కౌంట్ కావాలనుకున్న అర్హులు ఆలోపు అప్లై చేసుకోవాలని చెప్పింది.పలు కారణాల వల్ల అప్లికేషన్‌ను తాము తిరస్కరిస్తే ప్రాసెసింగ్ చార్జీల కింద 10 శాతం మినహాయించుకుని, మిగతా 90 శాతాన్ని దరఖాస్తుదారుడికి ఇస్తామని తెలిపింది. నిషేధిత లిస్టులోలేని భూములతో పాటు చెరువులు, కుంటలు వంటివాటికి 200 మీటర్ల పరిధిలోలేని ప్లాట్ల అప్లికేషన్లకు ఆటోమేటిక్‌గా ఫీజుకు సంబంధించిన వివరాలు వస్తాయి.వాటి పరిధిలోకి వచ్చే అప్లికేషన్లు రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు పంపుతారు. ఓపెన్ స్పేస్ రుసుము కట్టకుండానే ఎల్ఆర్ఎస్‌కు అప్లై చేసుకోవచ్చు. క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించొచ్చు. ఇటువంటి అప్లికేషన్లకు డిస్కౌంట్ మాత్రం రాదు. అలాగే, భవన నిర్మాణం సమయంలో ప్రొ-రేటా ఓపెన్ స్పేస్ రుసుమును చెల్లించాల్సి వస్తుంది. డిస్కౌంట్ కావాలనుకుంటే ఆ రెండు రుసుములను కలిపి చెల్లించడం మంచిది.

ఇలా స్టేటస్ తెలుసుకోండి

ఎల్ఆర్ఎస్ పోర్టల్ ఓపెన్ చేయండి

సిటిజన్ లాగిన్ కింద మీ మొబైల్ నంబరు ఎంటర్ చేయండి

మీకు వచ్చే ఓటీపీతో లాగిన్ అవ్వండి

మీ అప్లికేషన్ స్టేటస్ వస్తుంది

దరఖాస్తును తిరస్కరిస్తే కారణాలు కూడా అందులో ఉంటాయి

అప్లికేషన్ రిజెక్ట్ కాకపోతే పోర్టల్‌లో ఫీజు చెల్లించాలి

క్రమబద్ధీకరణ ఫీజు, ఓపెన్‌స్పేస్ ఛార్జీలు కలిపి చెల్లిస్తే 25 శాతం రాయితీ వస్తుంది

## బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవ్ బాబు

## గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## పాడి పంటలతో బేతిగల్ గ్రామం విరసిల్లాలి.



జమ్మికుంట వీణవంక మండల పరిధిలోని బేతిగల్ గ్రామంలో జరుగుతున్న భూలక్ష్మి,మహలక్ష్మి,బొడ్రాయి,సహిత పోచమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరిని కంటికి రెప్పలా కాపాడుకునే గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమపూజలో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందని,గ్రామంలోని ప్రజలందరూ పండగకు రావడం వలన గ్రామమంతా సందడిగా ఉందని అన్నారు.శ్రమ తీసుకుని ఇంతటి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి తనవంతు సహకారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతిగల్ గ్రామశాఖ కాంగ్రెస్ నాయకులు,వీణవంక మండల నాయకులు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## ఎమ్మెల్సీ ఫలితాలను నైతికంగా విజయం నాదే

## --- పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధిఎమ్మెల్సీ ఫలితాలను నైతికంగా విజయం తనదేనని పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాను నామినేషన్ వేసినప్పటి నుండి కాంగ్రెస్ నాయకులు తనకు ఫోన్ చేసి నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి ఒత్తిళ్లకు తలవంచకుండా పోటీలో ఉన్నందుకు తన మీద కుట్రపూరితంగానే బిజెపి కాంగ్రెస్ లు తమ ఓటర్ల వద్దకు వెళ్లి ప్రలోభాల గురిచేసి డబ్బుతో వారి ఓట్లను కొనుగోలు చేసిందని కాంగ్రెస్ పార్టీలోని ముఖ్య నాయకులు ట్రస్మా సంఘం నేతలకు ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసి తమకు పడే ఓట్లను వారి వైపుకు తిప్పుకున్నారని అన్నారు. జాతీయ పార్టీలను చెప్పుకొని ఓటుకు నోటు ఇచ్చి కొనడం సరైన పద్ధతి కాదని దీనికి ఎలక్షన్లు ఎందుకు నిర్వహించాలని ప్రభుత్వమే నేరుగా ఎమ్మెల్సీ పదవులను అమ్రస్ పెడితే కనీసం ప్రభుత్వానికి ఇంత డబ్బులను సమకూరుతాయి అని అన్నారు. ఎలక్షన్ కమిషన్ ఇప్పటికైనా స్పందించి గూగుల్ పే,ఫోన్ పే ల ద్వారా జరిగిన ట్రాన్సక్షన్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏది ఏమైనా నైతిక విజయం మాదేనని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన బిజెపి అభ్యర్థి అంజి రెడ్డికి కంగ్రాజులేషన్ తెలియజేస్తూ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పరిష్కరించి వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని మరియు కస్తూరిబా గురుకులాలలో పనిచేసే కాంటాక్ట్ టీచర్లకు సమాన పనికి సమాన వేతనం ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి వారికి హెల్త్ కార్డులు ఇన్సూరెన్స్ లు వర్తింప చేయాలని వారి సమస్యల పరిష్కారానికై కృషి చేయాలని అన్నారు. పట్టభద్రుల ఎలక్షన్లు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని తాను ప్రతి సమస్యపై తన గలాని వినిపిస్తానని పట్టభద్రులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానని అన్నారు. తాను ప్రజల పక్షవాదినని ప్రజలతో మమేకమై ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

# పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనఖీ చేసిన కలెక్టర్.



ప్రజాబలం ప్రతినిధిజయశంకర్ భూపాలపల్లి, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం గురించి చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలని, నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, అత్యవసర వైద్య సేవల కేంద్రం ఏర్పాటు, మరుగుదొడ్లు, కళాశాలలో ఎలాంటి వ్యర్దాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదని, నిశిత పరిశీలనతో విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. వైద్య సేవల కేంద్రాన్ని పరిశీలించి మందులను పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఏదేని అస్వస్థతకు గురైతే తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

# స్త్రీ-పురుష సమానత్వంకై పోరాడాలి!

## సమాన పనికి - సమాన వేతనంకై ఉద్యమించాలి:వీరమళ్ళ ఉమా




**భద్రాద్రి కొత్తగూడెం(ప్రజాబలం ప్రతినిధి** పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామంలో పిఓడబ్ల్యూ మండల నాయకురాలు జ్యోతి అధ్యక్షతన గ్రూప్ మీటింగులు నిర్వహించడం జరిగింది.

మార్చి 8 శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా పీవోడబ్ల్యూ పిలుపు కార్యక్రమంలో భాగంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ వీరమళ్ళ ఉమ రెడ్డిగూడెం గ్రామంలో జరిగిన గ్రూప్ మీటింగులనుద్దేశించి మాట్లాడుతూ. మార్చి 8 శ్రామిక మహిళల పోరాట దినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు, సదస్సులు నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు.

స్త్రీ-పురుష సమానత్వంకై పోరాడాలని, ఆధిపత్య పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలని, సమాన పనికి - సమాన వేతనంకై ఉద్యమించాలని, కగార్ పేరుతో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలుకై ఉద్యమించాలని పీవోడబ్ల్యూ పిలుపునిస్తోందన్నారు.స్త్రీ,ఆర్థికంగా రాజకీయంగా సాంఘికంగా సాంస్కృతికంగా అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణించాలని అప్పుడే,స్త్రీ జాతి అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందని అన్నారు.కానీ పాలక ప్రభుత్వాలు మహిళలను ఆట బొమ్మల చూస్తున్నారే,తప్ప వారి హక్కులను పూర్తిగా హరిస్తూ పురుష ఆధిపత్య భావజాలంతో స్త్రీ ని వంటింటి కుందేలుగా బంధిస్తున్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు.అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను, నర్సుల సమస్యలను, మున్సిపల్ వర్కర్ల సమస్యలను, పాకి పనిచేసే మహిళల సమస్యలను, భవన నిర్మాణ రంగంలోని మహిళల సమస్యలను, ఇతర అన్ని రంగాలలో పనిచేస్తున్న మహిళల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని, అందుకోసం ప్రతి ఒక్క మహిళ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు.మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా, గృహ హింసలకు వ్యతిరేకంగా, వరకట్నపు వేధింపులకు వ్యతిరేకంగా, ఇతర అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా, ఇతర కుల, వర్గ, జెండర్కు వ్యతిరేకంగా నిత్యం పోరాడాలన్నారు. దశాబ్దాలుగా శ్రామిక మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మార్చి '8'ని పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర నాయకురాలు వీరమళ్ళ ఉమ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లోబుడిగం కొమరమ్మ కళ్లెం పద్మమ్మ సోమ కలమ్మ దార పద్మ జక్కుల గంగమ్మ జక్కుల శైలజ మడవి గంగా విడమి సుజాత బుర్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ లో పడిపోతున్న నీటిమట్టం



నల్లగొండ నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటిమట్టాలు అంతకంతకు పడిపోతున్నాయి. -వేసవి రాకముందే డ్యాం నీటి నిల్వ సామర్థ్యం భారీగా పడిపోయింది. ప్రాజెక్టు నీటి మట్టం: 526 టబి/ 590 ఫీట్లు. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం: 160.4430 ౨ఓఅ/ 312 టీఎంసీ. సాగర్ కుడి కాల్వ ద్వారా: 8023 క్యూసెక్కులు. ఎడమ కాలువ ద్వారా: 8541 క్యూసెక్కులు.ఎల్ఎల్బీసీ ద్వారా హైదరాబాద్ కు తాగునీరు: 1350 క్యూసెక్కులు. వరద కాలువ ద్వారా: 280 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.

# కరీంనగర్ జిల్లాలో ప్రేమ జంట ఆత్మహత్య

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి**చొప్పదండి మండలం చిట్యాలపల్లికి చెందిన అరుణ్ కుమార్ (24), అదే మండలం భూపాలపట్నంకు చెందిన అలేఖ్య (21) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే తమ పెళ్లికి కుటుంబ సభ్యులు ఒప్పుకోరేమో అని భయంతో క్షణికావేశంలో తన స్నేహితుని గదిలో ఊరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# చేయి జారిన సిట్టింగ్ సీటు:



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిగ్ షాక్ తగిలింది తాజాగా జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోయింది. అందులో సిట్టింగ్ స్థానం కోల్పోవడం రేవంత్ సీటుకు ఎసరు తెచ్చేలా ఉంది.

దేశ వ్యాప్తంగానే కాకుండా తెలంగాణలో కూడా రేవంత్ రెడ్డి సర్కారు పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోన్న ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదు. తాజాగా జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కంటే ఒక్క సీటు కూడా అధికార పార్టీ కైవసం చేసుకోలేక పోయింది. ఇక బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నా, ఆ పార్టీ ఓటర్లు.. కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదనే విషయం స్పష్టమైంది. ఇక తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకం తీసుకున్న ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీని ఛీ కొట్టారనే చెప్పాలి.

ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఈ స్థానాన్ని భారతీయ జనతా పార్టీ దక్కించుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిపై బీజేపీ అభ్యర్థి విజయ బావుటా ఎగరేసారు. ఇది అధికార కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ సీటు కావడంతో విమర్శలు ఎదుర్కొంటోంది.

ఆరేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెగ్గిన కాంగ్రెస్కు ఇప్పుడు అధికారంలో ఉన్నా ఎదురుదెబ్బ తగిలింది. సిటింగ్ స్థానం కావడం.. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని అధిష్ఠానం పీసీసీకి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినా చివరికి ఓటమి తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల దగ్గరకు వెళ్లి చెప్పినా ఫలితం లేక పోయింది.దీంతో సీఎం రేవంత్ కు కష్టకాలం మొదలైందనే చెప్పాలి. దీంతో ఆయన పై అసమ్మతి నేతలు ఒక్కొక్కరుగా తిరుగుబాటు చేయడానికి రెడీగా ఉన్నారు. ఇప్పటికే పక్క పార్టీ నుంచి వచ్చిన ప్యారాష్యూట్ నేత అయిన రేవంత్ కు సీఎం కట్టబెట్టడం పై పార్టీని ఎంతో కాలంగా నమ్ముకున్న నేతలకు మింగుడు పడటం లేదు. అయితే అధిష్ఠానం వద్ద రేవంత్ రెడ్డి పలుకుబడి ఉండటం వలన ఏమి అనలేకపోయారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలల తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీ బొక్క బోర్లా పడటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంట్ డౌన్ మొదలైందనే కామెంట్స్ రాజకీయంగా వినబడుతున్నాయి.

# అమెరికాలో కేశంపేట యువకుడు మృతి

## ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్ళిన గంప ప్రవీణ్
## గన్ తో కాల్చడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఆరోపణ




షాద్ నగర్ అమెరికాలోనీ మిల్వాంకివిస్కాన్సిన్ సిటీలో నివాసం ఉంటున్న రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోనీ కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప ప్రవీణ్ (27) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ఎంఎస్ రెండవ సంవత్సరం చదువుతూ పార్ట్ టైంగా స్టోర్ లో జాబ్ చేస్తున్న ప్రవీణ్. మృతుడు నివాసం ఉండే ఇంటికి దగ్గర్లోని బీచ్ వద్ద గన్ తో కాల్చడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్

ఏలూరు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు చోదిమెళ్ళ బ్రిడ్జి వద్ద లారీ నీ ఢీకొట్టడంతో బస్సు లో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలు కాగా,ముగ్గురు మృతి చెందారు. బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరామర్శించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ వైద్యులను ఆదేశించారు.

# ఆపన్నులను ఆదుకునేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి

## సేవా కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు
## తలసేమియా బాధితులకు ట్రస్ట్ ద్వారా అండగా నిలబడతాం
## ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బంది సహకారం మరువలేనిది
## -ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి
## విజయవాడలో ట్రస్ట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



విజయవాడ, మార్చి 6:ఆపన్నులను ఆదుకునేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణానికి నారా భువనేశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ...ఇప్పటివరకూ హైదరాబాద్ నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీలుగా విజయవాడలో ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని భువనేశ్వరి తెలిపారు.

ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు

28 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ ట్రస్ట్ ను స్థాపించినప్పుడు చంద్రబాబు గారు మాకు ఒకటే మాట చెప్పారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ఏ నమ్మకంతోనైతే ఆయన ఈ బాధ్యతలు అప్పగించారో వాటిని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నాము. మాటల్లో చెప్పింది చేసి చూపిస్తున్నాము. ట్రస్ట్ ద్వారా ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నానంటే అందుకు మా టీం సభ్యులే కారణం. వారి సహకారం వల్లే ఇది సాధ్యమైంది. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేము పేదలకు సేవ చేస్తున్నామంటే అందుకు దాతల సహకారం మరువలేనిది. విరాళం ఎంతన్నది ముఖ్యం కాదు. పేదలకు అండగా నిలబడాలన్న ఆశయం ఎంతో గొప్పది. 2026 ఫిబ్రవరి నాటికి విజయవాడలో ట్రస్ట్ భవనం నిర్మాణం పూర్తి చేసి సేవలు ప్రారంభిస్తాము. ఈ ట్రస్ట్ భవనంలో ఆఫీస్, బ్లడ్ బ్యాంక్, తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేస్తాము. ఇటీవల విజయవాడలో తలసేమియా బాధితుల సహాయార్థం నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్ కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ స్పందన మాలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉత్సాహాన్ని కలిగించింది.

ప్రజాసేవ పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్ట్ పనిచేస్తోంది

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదల ముఖాల్లో చిరునవ్వు. ఎన్టీఆర్ స్ఫూర్తితో, చంద్రబాబు గారి ఆలోచనలు, సహకారంతో ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. త్వరలో హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, రాజమండ్రిలో కూడా తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాము. అవి 24 గంటలూ పనిచేస్తాయి. ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ 7,531 మందికి శిక్షణ అందించాము. 2,500 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి. అలాగే కుప్పంలో 150 మంది మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, సిల్క్ దారంతో గాజుల తయారీ, చికెన్ కారీ ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇచ్చాము. చంద్రబాబు గారు మహిళలు ఆర్థికంగా పైకి రావాలి, వారి కాళ్లపై వాళ్లు నిలబడాలని ఎపుడూ చెబుతుంటారు. డ్వాక్రా ఏర్పాటుతో అది ఆచరణలో చేసి చూపించారు కూడా.

ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి కల్పన

ట్రస్ట్ ద్వారా సంజీవని ఆరోగ్య క్లీనిక్ లు నడుపుతున్నాము. ఈ క్లీనిక్స్ వల్ల ఒక లక్షా 60 వేల 290 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించాము. ఇందుకోసం రూ. 4 కోట్ల 2 లక్షల 50 వేలు ఖర్చు చేశాం. ట్రస్ట్ ద్వారా 14 వేల 56 హెల్త్ క్యాంప్స్ కూడా నిర్వహించాము. వీటి ద్వారా 20 లక్షలమందికి ప్రయోజనం కలిగింది. ఇందుకోసం రూ. 22.43 కోట్లు ఖర్చుయింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో స్కూల్, మహిళా డిగ్రీ కాలేజ్ నిర్వహిస్తున్నాము. అందులో వచ్చిన లాభాలతో చల్లపల్లిలో స్కూలు నిర్వహిస్తున్నాము. పేద, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఆ స్కూల్లో ఉచితంగా విద్య అందిస్తున్నాము. ఇందులో 2 వేల 20 మంది చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువు చెప్తాము. చల్లపల్లి స్కూల్లో పిల్లల క్రమశిక్షణ చూస్తే నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. పేదలు, తల్లిదండ్రులు లేని వారికి జీవితం విలువ బాగా తెలుస్తుంది. అందుకే వారంతా పట్టుదలతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

విపత్తుల్లో ఆపన్నహస్తం

విపత్తుల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు అందించాము. ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీరుకొచ్చాం. కేరళలో వరదలు, హుద్ హుద్, తిత్లీ తుఫాన్, కర్నూలు వరదలు, విజయవాడ వరదల సమయంలో బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఉచితంగా మందులు, ఆహారం పంపిణీ చేయడం జరిగింది. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున న్యూట్రిఫుల్ యాప్ ను నిర్వహిస్తున్నాము. ఇందులో 16 మంది న్యూట్రిషనిస్టులు, డాక్టర్లు అందుబాటులో ఉంటారు. బీపీ, షుగర్, అధిక బరువు వంటి సమస్యలపై వీరు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తారు. ట్రస్ట్ ద్వారా స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నాము. మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇవ్వడం ద్వారా 7 వేలమందికి పైగా మహిళలు ఆర్థిక ప్రయోజనం పొందారు. ఇందుకోసం రూ. 20 లక్షలు ఖర్చు చేశాము. అలాగే అన్ని దానాల్లో రక్తదానం గొప్పదంటారు. ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాము. అర్ధరాత్రి తలుపుతట్టినా రక్తం ఇచ్చేందుకు ముందుకొస్తున్న డోనర్లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. తలసేమియా వ్యాధిగ్రస్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. యుఫోరియా మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని నారా భువనేశ్వరి తెలిపారు.

విరాళాలు అందించిన పలువురు దాతలు

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా పలువురు దాతలు విరాళాలు అందించారు. ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తాము భాగస్వాములు అవుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ట్రస్ట్ ద్వారా సేవలు ముందుకు తీసుకెళ్లేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ నారా భువనేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు బెంజిసర్కిల్ లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు.

# ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 06 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కన్నేపల్లి గ్రామంలో గత ఐదు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మరణించిన బోరే నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి గ్రామ కాంగ్రెస్ పార్టీ పక్షాన 5,600/- రూపాయలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోరు నీరు అక్రమ అమ్మకాలతో భూగర్భ జలాల కొరత.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 6 మార్చి 2025** భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ నాయకులు గుడ్ మార్నింగ్ మణికొండ మార్నింగ్ వాక్ గురువారం రోజున పుప్పాలగూడ పరిధిలోని సాయి గౌతమ్ నగర్ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో తిరిగి ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణలో సేకరించిన వివరాలు చెత్తా చెదారంతో నిండి ఉన్న ముష్కిం చెరువుకు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం కారణంగా దోమల బెడద తీవ్రతతో పిల్లలు పెద్దలు అనారోగ్యం పాలవుతున్నారని, కొంత మంది స్వార్థపరులు లోతుగా బోరింగ్ లు వేసి నీటిని తోడి ట్యాంకర్లకు ట్యాంకర్లు అమ్మకాలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం కలదని, అనుమతులు లేకుండా నీటిని అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని, ఛీటికి మాటికి విద్యుత్ శక్తి పోవడం మూలాన విద్యార్థులు, వయో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీధి కుక్కలతో పిల్లలు, పెద్దలు భయభ్రాంతులకు గురౌతున్నారని వాటిని షెల్టర్ హోమ్ కు తరలించాలని, అలనాటి పెర ఉన్న హోటర్ వారి బ్లోయర్ల ద్వారా వేడి వేడి ఆవిరి బయటకు వదలడం వలన స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కావున తది తర విషయాలపై సంబంధిత అధికారులు స్పందించి తగిన నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, సంగం శ్రీకాంత్, ఉపెందర్నాద్ రెడ్డి, యాలాల కిరణ్, భానుచందర్, కందాట ప్రవీణ్, బోడ్డు శ్రీధర్, సుమనళిని, తిరుపతి తది తరులు, తత్స్వర ప్రజల మద్దతుతో సహచర నాయకుల సహకారాలతో ఇట్టి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు గులాభిదళ సైనికులుగా రాబోయే సమయంలో తీవ్ర తరం చేస్తామని, మున్ముందు రాబోయే ఏ ఎన్నికల నయినా వీరోచితంగా ఎదుర్కొని పార్టీ జండా రెపరెప లాడించ డానికి సంసిద్ధంగా ఉన్నామనీ తెలియపరచడం జరిగినది.



## టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మల్క కొమురయ్య పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయోత్సవ సంబరాలు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 06** :ఉమ్మడి అదిలాబాద్-కరీంనగర్-మెదక్-నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి,టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య విజయం సాధించిన సందర్భంగా అంబేద్కర్,తెలంగాణ తల్లి, మరియు చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు తినిపించి విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ... బీజేపీ కి ఓటు వేసి గెలిపించిన టీచర్లకు, గ్రాడ్యుయేట్లు అందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు, రాబోయే రోజుల్లో తెలంగాణలో మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ అధికారం లోకి వస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాలరావు,మండల అధ్యక్షులు నాగిరెడ్డి హేమంత్ రెడ్డి,సామ వెంకటరమణ, సీనియర్ నాయకులు రమేష్ జైన్,నరేష్ జేన్,తమ్మినేని శ్రీనివాసు,గురువయ్య,కోమాకుల రవి, ముష్కం గంగన్న,బొక్కనపెల్లి సతీష్, మంద రాజేందర్, వేణుగోపాల్,తగరపు గంగయ్య, వేముల మధు,కానగంటి మల్లయ్య,బొప్పు కిషన్,బుద్ధి సిద్ధార్థ, సమరసింహ,బిజెపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## గెలుపుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు గెలుపొందినవారికి శుభాకాంక్షలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేసారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన, తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు. కొత్తగా గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు. ప్రజలతో మమేకమై బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం, శ్రమించిన కార్యకర్తలను చూసి గర్వపడుతున్నా. పీలోనూ ఎన్డీఏ అభ్యర్థుల విజయంపై మోదీ అభినందనలు తెలిపారు.

# జీవిఎంసీ ముందు మహిళా చేతన నిరసన

విశాఖపట్నం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖలో మహిళా చేతన జీవిఎంసీ వద్ద నిరసనకు దిగింది.సమాజంలో మహిళలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వాలు కృషి చెయాలని మహిళా చేతన నేతలు విజ్ఞప్తి చేశారు.మహిళా చట్టాలు అమలు కావడం లేదని,గృహహింసలకు మహిళలు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డా.కడవెండి వేణుగోపాల్ కుమారుడు వివాహం


GOVERNOR
ANDHRA PRADESH

S. Abdul Nazeer

RAJ BHAVAN

Dear Dr. Venugopal,

Yours

S. Abdul Nazeer

Dr. Kadavendi Venugopal
Paryavarana Mitra National Awardee
H.No. 7-3-154/2/C8, Sri Nilayam Apartment
RTA Office Road, Dwaraka Nagar,
Khammam-507002.




వివాహ వేడుకలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించడంతో ప్రముఖులతో ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికుడు డా.కడవెండి

ఖమ్మం ప్రతినిధి మార్చి 6 (ప్రజాబలం) ఖమ్మం డా. కడివెండి వేణుగోపాల్ కుమారుని వివాహం దేశ వ్యాప్తంగా పలువురు గౌరవనీయుల నుంచి శుభాకాంక్షలు అందుకుందని గౌరవనీయ గవర్నర్లు ముఖ్యమంత్రులు వారి కుటుంబానికి తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారని ఈ వివాహాన్ని డా. కడవెండి వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా నిర్వహించడం జరిగిందని పాటు ప్రతి అతిథికి మొక్కలను అందజేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఒక ఉదాహరణగా నిలిచారని పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన విశేష సేవలకు అనేక అవార్డులు లభించాయి అని ఆంధ్రప్రదేశ్ గౌరవనీయ గవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ డా.కడవెండి వేణుగోపాల్ కుటుంబానికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారని , డా. కడవెండి వేణుగోపాల్ కుమారుడు శ్రీ చక్రదర్ , చి.ల.సౌ. హసికల వివాహ మహోత్సవం 2025 మార్చి 2న హైదరాబాదులో, మార్చి 4న ఖమ్మంలో జరిగిన సందర్భంగా గౌరవ గవర్నర్ తమ శుభాకాంక్షలను తెలిపారని , ఆయన తన అభినందనల పత్రంలో వివాహ ఆహ్వానాన్ని అందుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు . అయితే అనివార్య కారణాల వల్ల హాజరుకాలేనందుకు విచారం వ్యక్తం చేస్తూ , నూతన వధూవరులకు సౌఖ్యమైన , ఆనందభరిత దాంపత్య జీవితం సాగాలని ఆకాంక్షించారు . అలాగే వారికి దైవ ఆశీర్వాదాలు లభించాలనీ కోరారు . పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డా. కడవెండి వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలక పాత్ర పోషించారని వారి కుమారుని వివాహ మహోత్సవం అతి వైభవంగా , పలువరు ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించ బడిందని ఒడిశా గౌరవనీయ గవర్నర్ శ్రీ హరి బాబు కంభంపాటి కూడా ఈ శుభావసరాన్ని పురస్కరించుకుని డా. కడవెండి వేణుగోపాల్ కుటుంబానికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారని , మార్చి 2 , 2025న హైదరాబాదులో జరిగిన వివాహానికి తమ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ , వధూవరులకు ఆనందభరిత జీవితం లభించాలని ఆశీర్వదించారని అన్నారు , ఐ ఇ మిజోరం గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ లాల్దుహోమా డా. కడవెండి వేణుగోపాల్ కుటుంబానికి , వారి కుమారుని వివాహానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారని ఈ శుభ సందర్భంలో వారు వదూవరులకు కలకాలం శుభసంపదలు ఆనంద జీవితం లభించాలని ఆకాంక్షించారు అంతేకాకుండా డా. వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణలో చేసిన విశేషకృషిని కొనియాడుతూ వారి పట్టుదల కృషిని అభినందించారని నాగాలాండ్ గౌరవనీయ గవర్నర్ శ్రీ లా. గణేశన్ కూడా డా. కడవెండి వేణుగోపాల్ కుటుంబానికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారని ఈ వివాహం సందర్భంగా వారు వధూవరులకు ప్రేమ సంతోషాలతో నిండిన దాంపత్య జీవితం లభించాలని ఆశీర్వదించారని ఐబీ గుజరాత్ గౌరవనీయ ముఖ్యమంత్రి డా. కడవెండి వేణుగోపాల్ కుమారుని వివాహానికి శుభాకాంక్షలు తెలియజేశారని ఈ శుభ సందర్భంలో వదూవరులు ఆనందభరిత జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారని ఈ సందర్భంగా డా. కడవెండి వేణుగోపాల్ కుటుంబ సభ్యులు వివాహ శుభాకాంక్షలు పంపిన గౌరవనీయులందరికీ తమ హృదయపూర్వక కృతజ్ఞతలు స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు

# రాష్ట్రస్థాయి జిజ్ఞాస ప్రదర్శనలో లక్షెట్టిపేట డిగ్రీ విద్యార్థులు






**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 06 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట కళాశాల విద్యా కమీషనర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పరిశోధన విలువలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ లో భాగంగా లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు,గణితం విభాగాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్నారు.తెలుగు ప్రాజెక్ట్ కి అధ్యాపకుడు డాక్టర్ తన్నీరు సురేష్ గణిత ప్రాజెక్ట్ కు అద్యాపకురాలు స్వప్న సూపర్ వైజర్లుగా వ ్య వ ఎ ా రి ం చ ్ గ ా విద్యార్థులు,శైలజ,విజయ్,తిరుపతమ్మ, లక్ష్మి, శ్రీనివాస్ తెలుగు సాయి,వర్షిణి,రజని,లక్ష్మి, శ్రీనాథ్ లు గణితం ప్రాజెక్టులను ప్రజెంటేషన్ చేసారు.హైదారాబాద్ లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు జిజ్ఞాస పోటీలు బుధవారం గణితం పోటీలు గురువారం నిర్వహించగా లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.ప్రాజెక్ట్ లో భాగంగా వారు ఆధునిక సమాజం,మానవ జీవితలో,పరిశోధనలో వస్తున్న మార్పులను పి.పి. టి.ద్వార మోడల్స్ ద్వారా యూనివర్సిటీ నుండి వచ్చిన సెలక్షన్ కమిటీకి వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జాయింట్ డైరెక్టర్ యాదగిరి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని సర్టిఫికెట్లు ప్రధానం చేసారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ మహాత్మా,జిజ్ఞాస కో ఆర్డనేటర్ జాడి శంకరయ్య, సూపర్ వైజర్ లు డాక్టర్ తన్నీరు సురేష్,స్వప్న,బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఎన్నికల్లో గెలుపోటములు సహజం మంత్రి పొన్నం

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రంజాన్ గిఫ్ట్ ఇచ్చానంటూ మాట్లాడుతున్న బండి సంజయ్ వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవగాహనలేమి కి నిదర్శనంగా ఉన్నాయి . దమ్ముంటే బిజెపి నేతలు కేంద్రం నుంచి వచ్చే నిధులు పనులు తీసుకురావాలి. రామగుండం నుంచి హైదరాబాద్ వరకు ఎయిట్ లైన్ రహదారి నిర్మాణం చేపట్టాలి. ఇదంతా బీఆర్ఎస్ బిజెపి మైత్రిని తెలిపే ముచ్చట. రెండూ కలిసి కాంగ్రెస్ ను ఓడించాలని ప్రయత్నించాయి. కేసీఆర్,హరీష్ రావు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే అభ్యర్థులను పెట్టకుండా బిజెపితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఇదంతా తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. గతంలో టూరిజం ఆర్కియాలజీ మినిస్టర్ గా ఉండి హైదరాబాద్ కు చేసింది ఏంటి అని ప్రశ్నిస్తున్నా. రాష్ట్రం పట్ల బీజేపీ ఇప్పటికే వివక్ష చూపుతూనే ఉంది. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో బిజెపి ఎంపీలు ఎందుకు కృషి చేయడం లేదు. కేటీఆర్, కేసీఆర్,హరీష్ ఎటు ఓటు వేశారో చెప్పాలి. బీజేపీ చెల్లని ఓట్ల అంత మెజార్టీ కూడా రాలేదు. ఎందుకు అంత మిడిసిపాటు..? ఎమ్మెల్సీ ఎన్నికల్లో తక్కువ తేడాతో ఓటమి పాలయ్యాము. ఓటమిపై సమీక్షించుకుంటాము. ఈ ఓటమి భవిష్యత్ పై ఎలాంటి ప్రభావం చూపించదని అన్నారు.

## శాంతిభద్రతలకు అవరోధమయ్యే భూసమస్యలపై తక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 06** : జిల్లాలో శాంతిభద్రతలకు అవరోధంగా మారే భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం దిశగా మండల,సబ్-డివిజన్, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశిల్దార్,ఎస్.హెచ్.ఓ.లు ఉంటారని,నివాస ప్రాంతాలు,నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్లను ప్రత్యేక అధికారులుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల కమిటీ ప్రతినిధులు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్లో వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయిస్తారని తెలిపారు. దరఖాసును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించడం జరుగుతుందని, కనీసం 15 రోజులు,గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు.మండల పరిధిలోని రెవెన్యూ, పోలీస్,మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కమిటీ సూచనలు అనుసరించాలని తెలిపారు. సబ్-డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు ఉంటారని, మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలిస్తారని, సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగు సూచనలు చేస్తారని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్,డి.సి.పి.ఉంటారని, మండల,సబ్-డివిజన్ స్థాయి దరఖాస్తుల ప్రక్రియపై నెలవారి సమీక్ష నిర్వహిస్తారని, 21 రోజులలో పరిష్కారం కాని దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు.నకిలీ/తప్పుడు ధృవపత్రాలుగా అనిపించినట్లయితే తదుపరి చర్యల కొరకు జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. కమిటీల సంబంధిత పనితీరు, ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కొరకు జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 08736-250106 నంబర్ను అందుబాటులో ఉంచడం జరుగుతుందని,ప్రజలు తమ సమస్యలను కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.కమిటీకి సంబంధించిన అధికారులు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,విధులలో నిర్లక్ష్యం,అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 06 :** జిల్లాలో ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరుగనున్న ఎస్.ఎస్.సి. వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాలను మండల తహశిల్దార్ దిలీప్ కుమార్,మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి సందర్శించి వంటశాల,భోజనశాల, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్,మూత్రశాలలు, శౌచాలయాలు,ప్రహారీగోడ ఇతర మౌళిక సదుపాయాలు కల్పించడంతో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తుందని, విద్యార్థుల సౌకర్యార్థం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని,వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రానున్న 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని,తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను సందర్శించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను 100 శాతం వసూలు చేసి పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఉపాధ్యాయులు,విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ కళాశాలలో సైన్స్ డే



**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 6 ( ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్ జేఎన్టీయూ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం ఇనిస్ట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సైన్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి. నరసింహ,మాట్లాడుతూ సైన్స్ మానవ పురోగమనానికి ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు, చక్రం సృష్టించడం నుంచి బాహ్య అంతరిక్షం అన్వేషణ వరకు వ్యాఖ్యల అభివృద్ధి నుంచి, కృత్రిమ మేధస్సు వరకు, సైన్స్ ప్రపంచాన్ని విస్తృతంగా ప్రభావితం చేస్తుందని చెప్పారు, మరోవైపు( సి ఆర్ సి )చైర్మన్ హ్యూమానిటీస్, అండ్ సైన్స్ విభాగాధిపతి, డాక్టర్ విజయకుమార్, సివి రామన్, చిత్రపటానికి పూలమాల వేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కల్పించి కొత్త ప్రయోగాలకు ప్రేరణ కల్పించడం వైజ్ఞానిక విజయం గురించి అవగాహన కల్పించడం లక్ష్యమని చెప్పారు, ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఆచార్య రాఘవేంద్రరావు, విభాగాధిపతులు ఆచార్య రజనీష్, ఆచార్య జోషి ప్రసాద్, ఆచార్య బేబీ శాలిని, బోధన బోధనేతర సిబ్బంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు..

### భూమిపూజకు జగన్ ను ఆహ్వానించిన నందీపుర పీఠాధిపతులు

తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ను కర్ణాటకలోని విజయనగర జిల్లా నందీపుర పీఠాధిపతులు కలిసి భూమిపూజకు ఆహ్వానించారు. ఏప్రిల్ 30 న నందీపురలో ప్రపంచంలోనే ఎత్తయిన 108 అడుగుల శ్రీ అర్ధనారీశ్వర స్వామి విగ్రహానికి భూమిపూజ కార్యక్రమం జరగనుంది. వైయస్ జగన్కు పీఠాధిపతులు శ్రీ డా.మహేశ్వర స్వామిజీ (నందీపుర పుణ్యక్షేత్రం), శ్రీ ష.బ్ర. పంచాక్షరి శివాచార్య స్వామిజీ (హీరే మఠం, బెన్నిహళ్ళి), శ్రీ జడేశ్వర తాత (శక్తి పీఠం, వీరాపుర), శ్రీ కృష్ణపాద స్వామిజీ (భుజంగ నగర్, సందూర్) ఆహ్వానపత్రిక అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్సీపీ ఎంఎల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్, రామచైతన్య (ఫౌండర్, అర్ధనారీశ్వర ఫౌండేషన్), వీరేష్ ఆచార్య (కో-ఫౌండర్, అర్ధనారీశ్వర ఫౌండేషన్) పాల్గొన్నారు.

## కల్వర్టుపై ప్రమాదకరంగా గుంత

### - పట్టించుకోని అధికారులు పాలకులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 6 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గ్ మండల పరిధిలో గల ముప్పారం గ్రామానికి వెళ్లే చక్కని బీటీ రోడ్డుపై నిర్మించిన కల్వర్టుపైన పెద్ద గుంత( 5, ఫీట్ల లోతు వరకు ) ఏర్పడి ప్రమాదకరంగా మారిన అధికారులకు గాని, పాలకులకు గాని,పట్టింపు లేకుండా పోయింది, కల్వర్టుపై ఏర్పడ్డ గోతిలో పడి వ్యక్తులు క్షతగాత్రులు అయితే కానీ అధికారులు పాలకులు అటువైపుగా మర మతులు చేసేలా లేరని, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఈ రోడ్డు గుండా నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి, చిన్నపాటి వ్యయంతో ఈ గుంతకు మరుమతులు చేసే అవకాశం ఉన్న ఎవరికి పట్టకపోవడం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు

ఈ రహదారి గుండానే అధికారులు ముప్పారం వైపు వెళ్తున్న ఈ కల్వర్టు పైన ప్రమాదకరంగా ఏర్పడిన గుంత వారికి కానరావడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డు కల్వర్టు పైన ఏర్పడిన గుంతను, వెంటనే పూడ్చి ఈ రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్భయంగా ప్రయాణించేలా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు...

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి - 06(ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు.పరీక్షా కేంద్రంలోని అన్ని గదులను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంత మంది హాజరు.. గైర్హాజరు అయ్యారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.అనంతరం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు కలిసి తనిఖీ చేశారు. ప్రతీ గదిని సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### - ఎంఈఓ కరుణాకర్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 6 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గం మండల కేంద్రంలో బుధవారం (కేజీబివి)జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను, మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు, ఆయా పాఠశాలల పరిసరాలను కరుణాకర్,పరిశీలించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే వంటగదిని, భోజనం వండే కూరగాయలను, పరిశీలించారు, ఈ సందర్భంగా (ఎం ఈ ఓ,) కరుణాకర్, మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలని, ఆదేశించారు,( కేజీబివి )జూనియర్ కళాశాలను సందర్శించి, నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు, ఈ కార్యక్రమంలో( ఎంపీడీవో) చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు..

### టాస్క్ సంస్థకు నీతి ఆయోగ్ ప్రశంసలు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ అకాడమి ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు నీతి ఆయోగ్ ప్రశంసలు దక్కాయి. ఈ సందర్భంలో నీతి ఆయోగ్ ప్రశంసలు తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మా ప్రభుత్వం చేసిన కృషికి నిదర్శనమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నీతి ఆయోగ్ నివేదిక గురించి ప్రస్తావిస్తూ, టాస్క్ ద్వారా తెలంగాణ యువతకు మరియు విద్యార్థులకు కలిగిన ప్రయోజనాలను కేటీఆర్ గుర్తు చేశారు.2014లో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ గారి మార్గదర్శనంలో టాస్క్ను ప్రారంభించి, అనేక విజయాలు సాధించిందని కేటీఆర్ తెలిపారు. ముఖ్యంగా, టాస్క్ ద్వారా పారిశ్రామిక వర్గాలు, విద్యారంగం మరియు ప్రభుత్వాలను కలుపుతూ, నాణ్యమైన మానవ వనరుల తయారీకి, శిక్షణకు టాస్క్ ఎంతగానో ఉపయోగపడిందని ఆయన అన్నారు. టాస్క్ సాధించిన విజయాలను నీతి ఆయోగ్ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ యువత కోసం స్కిల్లింగ్ రంగంలో చేసిన సేవకు దక్కిన గుర్తింపని ఆయన అభివర్ణించారు.గత పది సంవత్సరాలలో టాస్క్ సంస్థ అనేక గొప్ప విజయాలు సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యంగా, 761 కాలేజీలలోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని, 9 లక్షల 84 వేల మంది విద్యార్థులకు మరియు 18,650 మంది ఫ్యాకల్టీకి శిక్షణ అందించిందని ఆయన గుర్తు చేశారు. సుమారు 80 పారిశ్రామిక సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుని, 35 వేల మందికి పైగా విద్యార్థులకు మరియు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందని కేటీఆర్ తెలియజేశారు. నైపుణ్యవంతమైన తెలంగాణను ఏర్పాటు చేసే దిశగా టాస్క్ సంస్థ ఆవిర్భావం మరియు దాని పనితీరు ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.నీతి ఆయోగ్ తన నివేదికలో టాస్క్ యొక్క పనితీరును గొప్పగా ప్రశంసించింది. స్కిల్లింగ్ రంగంలో అందరికీ అవకాశాలు అందేలా, విద్యార్థులకు ఉద్యోగాలు అందేలా, నైపుణ్యం కల్పించేలా టాస్క్ గొప్పగా పని చేసిందని నివేదికలో తెలియజేసింది. ముఖ్యంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి టాస్క్ సంస్థ ద్వారా ఎంతగానో లబ్ధి చేకూరిందని పేర్కొంది. పారిశ్రామిక వర్గాల అవసరాలకు అనుగుణంగా టాస్క్ ఇచ్చిన శిక్షణ వల్ల విద్యార్థులు మరియు యువత ఉపాధి అవకాశాలను సులభంగా పొందగలిగారని, టాస్క్ యొక్క పనితీరును నీతి ఆయోగ్ అభినందించింది.

## షమిమ్ అక్తర్ రిపోర్టులో ఉన్న లోపాలను సరి చేసి మాదిగలకు న్యాయం చేయాలి.

### మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 06(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/జహీరాబాద్:మహాజన నేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఇచ్చిన కార్యాచరణలో భాగంగా జహీరాబాద్ పట్టణ కేంద్రంగా ఐబీ నుండి అంబేద్కర్ కూడలి వరకు ఉల్లాస్ మాదిగ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది.అనంతరం అబ్రహం మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మైసగాళ్ళ బుచెంద్ర ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు మట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా జరిగిన పోరాటం మాదిగలకు న్యాయంగా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వాట రావాలని పోరాటం చెయ్యటం జరిగిందని కానీ ఇప్పుడు తెలంగాణాలో అత్యధికంగా జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం రావల్సి ఉండగా కమిషన్లో ఉన్న లోపం కారణంగా మాదిగలకు 9 శాతం మాత్రమే వచ్చిందని దానిని వెంటనే సవరించి మాదిగల జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మరియు రేపు ప్రభుత్వం చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని లేని పక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతమని హెచ్చరించారు,మరియు ఉమ్మడి ఎస్సీలను మూడు గ్రూపులుగా కాకుండా గతంలో ఉండే విధంగా నాలుగు ఏబిసీడీ లుగా వర్గీకరణ చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జహీరాబాద్,ఝరాసంగం, కోహీర్ మండల అధ్యక్షులు టీంకు మాదిగ, మైకల్ మాదిగ, రవి మాదిగ, రాంచందర్ ఏం ఈ ఎఫ్,జిల్లా అధ్యక్షులు,ఎమ్మెఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు జైరాజ్ మాదిగ, నవీన్ కుమార్ ఎంజేఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ,మంచేందర్ పి ఎ సి ఎస్,చైర్మన్, జైరాజ్, భాస్కర్ జడ్పీటీసీ, శ్రీనివాస్,ప్రవీణ్ ఏఈ,నర్సి%శీ%ములు, రాజు,చిన్న, సుదీష్ కుమార్, అజయ్, కుమార్, పవన్, లాజర్, సురేష్, విల్సన్, ప్రభాకర్, మనోజ్, సంపత్, ప్రణయ్, కిట్టు, జనార్దన్, ప్రవీణ్, చిట్టీ, లాజర్, శ్రీనివాస్,శాంసన్, ఇమ్మానుయేల్, అభిషేక్, ప్రణయ్, నర్సింహా, సూర్యకాంత్, రమేష్, దిలీప్, దింపుల్, అబ్రహం,ప్రశాంత్, జ్యోతుల్, షాలేం,మనీష్, సురేష్, మూర్జల్, ధనరాజ్, విద్యాసాగర్, సోను, జనార్దన్, మాణిక్యం,అజీమ్, మహేష్,బన్నీ,పెంటన్న,నిర్మల్,దేవయ్య,జైపాల్,సుధాకర్, జీవన్,అనిల్, ప్రభాకర్, అమృత్,శ్యామ్ సుందర్,రాజేందర్,సతీష్, రాహుల్, అనిల్, పవన్, ముత్తర్గల్లా రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు..

## పత్తి రైతు పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు

### -సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేగుంటచంద్రశేఖర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, మార్చి 6:**దేశానికి వెన్నెముకైన రైతు పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నేడు రైతు కన్నీరు పెట్టాల్సిన దుస్థితి నెలకొంటుందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ అన్నారు. గురువారం చెన్నూరు పట్టణ కేంద్రంలోని తాపీ మేస్త్రి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులను అధికారుల అండదండలతో దళారులు విపరీతంగా దోచుకుంటున్నారని, పండించిన పత్తిని అమ్ముకోవడానికి కూడా చెన్నూరు నియోజకవర్గంలో రైతులు కన్నీళ్లు పెడుతున్నారని, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పత్తి రైతుల ఆవేదనను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, రైతుల బాగోగులు చూడాల్సిన కనీస బాధ్యత స్థానిక నాయకులకు లేకుండా పోయిందని ఆయన ఆరోపించారు. పత్తి రైతుల ఆవేదనను పట్టించుకోని నాయకులు, అధికారుల తీరును ఉపేక్షించేది లేదని, పత్తి రైతులకు ఎర్రజెండా అండగా నిలిచి దళారుల దోపిడీ నుండి పత్తి రైతులను కాపాడే దిశగా ఎర్రజెండా అండగా రైతుల పక్షాన పోరాడతామని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు సూత్రం నారాయణ, దుర్గం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్, రిమాండ్ కి తరలింపు.



**రాజన్న సిరిసిల్ల జిల్లా,ఫిబ్రవరి-6 (ప్రజాబలం ప్రతినిధి)**గ్రామాల్లో సంచరించే అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించండి.నిందుతుని వివరాలు,అజయ్ %o/శీ% గిరీష్ , వయస్సు :-20 సం"లు,,%=/శీ% జనతా కాలనీ, నగిరెగరే గ్రామం,గౌరీబిందనూర్ తాలూకా,చిక్కబల్లాపూర్ జిల్లా,కర్ణాటక రాష్ట్రం.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ,కర్ణాటక రాష్ట్రనికి చెందిన అజయ్ అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో మోటర్ సైకిల్ పై సంచరిస్తూ పలు జిల్లాల్లోని గ్రామాలలోని అనారోగ్యానికి గురైన అమాయకమైన ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్నటువంటి పక్షవాతం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్తూ ఆయుర్వేద వైద్య చికిత్స చేసి తగ్గిస్తాఅంటూ నమ్మించి ఆయుర్వేద వైద్య కోసం వారివద్ద నుండి పెద్ద మొత్తంలో 10వేల నుండి 50 వేల వరకు డబ్బులు వసూలు చేసి మళ్ళీ వచ్చి వైద్యం చేస్తా అంటూ వెళ్లిపోయేవాడు నమ్మ పలికి అక్కడి నుండి వెళ్లి పోయి అమాయకమైన ప్రజలను మోసం చేస్తుండవాడు.తెలుగు రాష్ట్రాలలో అనంతపూర్,మహబూబ్ నగర్,నారాయణఖేడ్,రంగారెడ్డి,నిజామాబాద్,కరీంనగర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిందితుడు సంచరిస్తూ అమాయకమైన ప్రజలను ఆయుర్వేద వైద్యం పేరుతో మోసాలకు పాల్పడుతుండే వాడు అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణ పరిదిలోని శాత్రాజు పల్లి,ముస్తాబాద్ మండల పరిధిలోని బద్నకల్, వెంకట్రావుపల్లి మరియు గంభీరావుపేట్ మండలం లోని లింగాన్నపేట గ్రామనికి చెందిన కొడిమోజు లక్ష్మి %ఏ/శీ% ప్రభాకర్ వద్దకు తేది: 12-11-2024 రోజున నిందితుడు వెళ్లి ఆమె భర్తకి పక్షపాతం ఉన్నదని తెలుసుకొని ఆమె ఇంటికి వెళ్లి ఆమెకి లేనిపోని మాయ మాటలు చెప్పి నీ భర్తకి పక్షపాతం నయం చేస్తా అని నమ్మించి ఆమె దగ్గర నుండి 20 వేల రూపాయలు ఫోన్ పే చేయించుకొని ఆమె వద్ద ఉన్న కొత్త దుబాయి దుప్పటను తీసుకొని మళ్ళీ వస్తా ఇంకా కొన్ని మందులు తెస్తా అని నమ్మించి అక్కడి నుండి వెళ్లి పోయినాడు.ఇలా వివిధ గ్రామాలలోని ప్రజలను నమ్మించి మొత్తం సుమారుగా 5నుండి6లక్షల రూపాయలను మోసం చేసి మళ్ళీ ఈ రోజు ఎవరైనైన మోసం చేయడానికి ఉన్నరా అని గంభీరావుపేటలో తిరుగుచుండా పోలీసు పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకొని విచారించగా తెలంగాణ రాష్టంలో సుమారుగా 50 మందికి పైగా మోసం చేసాడని నిందితుడు ఒప్పుకొనగా నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగిందని డిఎస్పీ తెలిపారు.నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది,ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, పిసి శ్రీనాథ్ లను డిఎస్పీ అభినందించారు.

## బీజేపీ దండేపల్లి మండల పార్టీ నాయకులు సంబరాలు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 06:** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లిలో ఎమ్మెల్సీగా అంజి రెడ్డి గెలిచిన సందర్భంగా దండేపల్లి మండల పార్టీ అధ్యక్షులు గోపతి రాజయ్య ఆధ్వర్యంలో పటాకులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు మండల ప్రధాన కార్యదర్శి చీపురిశెట్టి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు బండే సత్యం,కర్ణల కిషన్, ముత్తినేని మల్లేష్,నెల్కి మల్లేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వనపర్తి రాకేష్, పిఎసిఎస్ చైర్మన్ బెడద సురేష్, మండల కార్యదర్శి గోపే రాయమల్లు,చిట్ల శ్రీనివాస్,పుదరి రమణయ్య మొండయ్య వెంకటేశ్వర్లు,చోయం కిషన్, కొల్లూరి రాకేష్,భూత్ అధ్యక్షులు దావనపెల్లి శకుంతల,హరీష్, టేగుంట్ల గురవయ్య,అడప సంతోష్,గుండ రవీందర్, నందుర్కి ప్రశాంత్,కుంచె స్వామి, బూమేష్,తతితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్య సర్టిఫికెట్లు సృష్టించిన వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి సస్పెన్షన్::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా,మార్చి- 06:** (ప్రజా బలం ప్రతినిధి)నకిలీ వైద్య సర్టిఫికెట్లు సృష్టించిన వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఎల్లారెడ్డిపేట మండలం గోల్లపల్లి పి.వి.సి కార్యాలయంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా పనిచేస్తున్న జె. కొమురయ్య జనవరి 19, 2024 న మెడికల్ ఇన్ వాలిడేషన్ కోసం దరఖాస్తు చేసుకొని కరీంనగర్లోని సన్ షైన్ హాస్పిటల్స్ జారీచేసిన సర్టిఫికెట్లను సమర్పించడం జరిగింది.అనంతరం విచారణలో జె. కొమురయ్య సమర్పించిన సన్ షైన్ హాస్పిటల్స్ వైద్య సర్టిఫికెట్లు ఫేక్ అని తేలడం జరిగింది, 2017 నుంచి సదరు వైద్యుడు ఆసుపత్రిలో పనిచేయడం లేదని, లెటర్ హెడ్, స్టాంప్స్ మొత్తం నకిలి అని,సంతకాలు కూడా వైద్యులు చేయలేదని విచారణలో తేలడం జరిగింది.నకిలీ వైద్య పత్రాలు సృష్టించినందుకు సంబంధిత వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి పై ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ లో సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది,తప్పుడు పత్రాలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించినందుకు గాను అధికారిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఎం. పి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, మార్చి 6:**పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకుడు రాయబారపు కిరణ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాయబారపు కిరణ్ మాట్లాడుతూ కాజీపేట్ నుండి బల్లార్షకు వెళ్లే రైలు గత కరోనా సమయంలో రద్దు చేయడం జరిగింది. గత బిఆరెఏస్ నాయకుల నిర్లక్ష్యం వల్ల కరోనా తర్వాత రైలు పున ప్రారంభం చేయలేదు.దీనివల్ల ప్రయాణికులు, వ్యాపారస్తులు,కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సమస్యను తెలుసుకున్న పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి కలిసి గత ఐదు నెలల నుండి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మరియు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులను పలుమార్లు సమావేశమై కోరగా వెంటనే స్పందించిన రైల్వే శాఖ ఈ యొక్క కాజీపేట బల్లర్ష వెళ్లే రైలు పునః ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు పునః ప్రారంభం యువ నాయకుడు ఎంపీ వంశీ కృష్ణ, చెన్నూరు ఏమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి వల్లనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ వచ్చినంక పెద్దపల్లి పార్లమెంటు మరియు చెన్నూరు నియోజకవర్గం జరిగే అభివృద్ధి తో ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు మండల యూత్ కార్యదర్శి బియ్యపు రవి కిరణ్, రామసాని సురేందర్, పానుగంటి లక్ష్మణ్, ధనుక్ రాజేష్,చోటు,గణేష్,మహేష్, జీవన్, రాజేష్, చింటూ, శేఖర్, శ్రీను, సుజిత్, అశ్రఫ్, సాత్విక్ లు పాల్గొన్నారు.

## పిల్లలకు ఆధ్యాత్మిక వాతావరణం నేర్పించాలి.



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్మార్చి 6:**పిల్లలకు ఆధ్యాత్మిక వాతావరణం నేర్పించి వారిని భగవాన్ స్మరణం వైపు నడిపించాలని వేద పండితులు సూచించారు గురువారం బురదగుడంలోని అష్టలక్ష్మి మరియు కామాఖ్య దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలు ముగిసింది. గత మూడు రోజులుగా ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక పూజలు వేద పండితులు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనందరం సుఖసంతోషాలతో ఉండాలంటే దేవుని పూజించాలని ఎందుకోసం ప్రతిరోజు దేవుని స్మరించాలని అప్పుడే మన ఆధ్యాత్మిక జీవనం బాగుంటుందని పేర్కొన్నారు పిల్లలను చిన్నప్పటినుండే ఆధ్యాత్మిక జీవితం వైపు మళ్ళించాలని అప్పుడే వారిలో సంస్కారం పెరుగుతుందని సూచించారు ఆలయ పూజారి సతీష్ భవాని మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బుడదగూడెంలో అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయాన్ని స్థాపించడం జరిగిందని ప్రజలంతా దేవత మూర్తులకు పూజలు నిర్వహించి వారి ఆశీస్సులు పొందాలని సూచించారు ప్రతి మనిషికి కోరికలు ఉంటాయని ఆ కోరికలు నెరవేరాలంటే భగవంతుని ఆశీస్సులు తప్పనిసరి అని సూచించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com